Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 28.11.2014, శుక్రవారం
సంపుటి : 34 సంచిక : 26
పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



# కమలం వైపు.. రెడ్ల చూపు


## తెలుగుదేశంలో కులాధిపత్యం బీజేపీకి వరంగా మారనుంది

***రాజకీయాలలో విశాలదృక్పథం, సంకుచిత స్వభావం అనే రెండు విభిన్న పోకడలు నిత్యం దర్శనమిస్తుంటాయి. నా కులం, నా మతం అనేది సంకుచిత స్వభావం. అందరూ నా వాళ్లే అనుకోవడం విశాలదృక్పథం. దేశ రాజకీయ చరిత్రను పరిశీలిస్తే కులమతాలకతీతంగా విశాలదృక్పథంతో ప్రజల గురించి ఆలోచించిన నాయకులే చరిత్రలో నిలబడ్డారు. కులం కంపు, మతం దురద అంటించుకున్నోళ్లు తాత్కాలికంగా అధికారాన్ని అనుభవించినా శాశ్వతంగా చరిత్రహీనులుగా మిగిలిపోయారు.***

ఆఖరకు 2002గుజరాత్ అల్లర్ల ద్వారా హిందూవాదిగా ముద్రపడ్డ ప్రధాని నరేంద్రమోడీ సైతం ఈరోజు కుల మతాలకతీతంగా దేశప్రజలంతా ఒకటే నంటూ అందరిమన్ననలు పొందుతున్నారు. దేశ రాజకీయాలలోనే కులం, మతం అనే భుజకీర్తులను వదిలించుకునే ప్రయత్నం జరుగుతుండగా, అందుకు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం సరికొత్త కులరాజకీయాలు రాజ్యమేలుతున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మొదటి నుండి రెడ్ల ప్రాబల్యం ఎక్కువ. రెడ్లు రాజకీయాలు చూస్తుంటే, కమ్మ వర్గీయులు సినిమాలు, వ్యాపారాలపై పట్టు సాధించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువకాలం కాంగ్రెస్ ప్రభుత్వమే ఉండింది. రెడ్లే ముఖ్యమంత్రులుగా అధికారం చెలాయించారు. 1983లో ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ పెట్టేంతవరకు కూడా రాష్ట్రంలో రెడ్లకు తిరుగులేకుండా వుండింది. అయితే ఎన్టీఆర్ పార్టీ పెట్టినా ప్రజల్లో కులం ఫీలింగ్ రాలేదు. కేవలం ఆయన మీదున్న అభిమానంతోనే ఓట్లేసారు. తెలుగుదేశం ప్రభుత్వంలో రెడ్లకు గణనీయ ప్రాధాన్యత ఉండింది. 1995 నుండి 2004దాకా చంద్రబాబు సీఎంగా పనిచేసిన కాలంలో కూడా రెడ్లకు (మిగతా 10వ పేజీలో)

## పర్యటన జాస్తి...

# ఫలితం నాస్తి



### • మాస్టర్‌ప్లాన్‌కే 1200కోట్లు అడిగిన సింగపూర్

ముఖ్యమంత్రి చంద్రబాబుకు సింగపూర్ వంటి రాజధాని పిచ్చి పట్టుకుంది. సింగపూర్‌లో ఆయనకు ఏం కనిపించిందోగాని అదే కలవరింత అయ్యింది. తన సింగపూర్ కలను నిజం చేసుకోవడానికి ఆయన మందీమార్భలంతో స్పెషల్ ఫ్లైట్ ఒకటేసుకుని ఇటీవల ఆ దేశానికీ పోయాడు. అక్కడంతా తిరిగాడు. సింగపూర్ ప్రభుత్వ ప్రతినిధులతో సమావేశమయ్యారు. (మిగతా 10వ పేజీలో)



# కలెక్టర్ జానకి

### • రాజధానికి శ్రీకాంత్

*నెల్లూరుజిల్లా కొత్త కలెక్టర్‌గా ఎం.జానకిని నియమిస్తూ ప్రభుత్వం 25వ తేదీ ఉత్తర్వులు జారీ చేసింది. గ్రేటర్ విశాఖ అదనపు కమిషనర్‌గా పనిచేస్తున్న ఆమె పదోన్నతి మీద నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా వచ్చింది.*

తమిళనాడుకు చెందిన ఎం.జానకి 2005బ్యాచ్ ఐఏఎస్ అధికారి. రాష్ట్రంలో మొదట నల్గొండజిల్లా భువనగిరి సబ్‌కలెక్టర్‌గా పనిచేశారు. ఆ తర్వాత భద్రాచలం సబ్‌కలెక్టర్‌గా, చిత్తూరుజిల్లా డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా, తిరుపతి నగరపాలక సంస్థ (మిగతా 10వ పేజీలో)

## కోర్టు ఆదేశించినా.. అనిల్‌గార్డెన్స్‌ను




# తొలగించరా..?

### • కమిషనర్‌ని కలిసిన మాజీఎమ్మెల్యే కొమ్మి

***అనిల్‌గార్డెన్స్‌పై చర్య తీసుకోవాలంటూ 2014 ఫిబ్రవరి 24వతేదీన కోర్టు తుదితీర్పు వెలువరించి ఆదేశాలు జారీచేసినా ఇంతవరకు మునిసిపల్ సిబ్బంది స్పందించకపోవడంపై 'కొమ్మి' తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నాడు. మునిసిపాలిటీ వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని లేదంటే విషయాన్ని రాష్ట్రస్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్తానని చెప్తున్నారు.***

మాస్టర్‌ప్లాన్ రోడ్డును ఆక్రమించేసి, నిబంధనలను తుంగలో తొక్కి నిత్యకళ్యాణాలు, వేడుకలతో వ్యాపార కేంద్రంగా విరాజిల్లుతున్న నెల్లూరు మినీబైపాస్‌రోడ్డులోని 'అనిల్ గార్డెన్స్' అక్కడుంటున్న స్థానికులకు మాత్రం పెద్ద న్యూసెన్స్‌గా తయారైంది. పెళ్ళిళ్ల సీజన్‌లో అయితే ఇక్కడనుండి వచ్చే శబ్దాలకు చుట్టుపక్కల (మిగతా 10వ పేజీలో)



## ఇసుక రవాణా అక్రమంగా కాదు...

# సక్రమంగా జరిగేలా చూడండి



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, పక్కన జిల్లా ఎస్పీ సెంథిల్‌కుమార్

స్వయంసహాయక గ్రూపుల ద్వారా ఇసుక రవాణా కార్యక్రమం నిబంధనల మేరకు సక్రమంగా అమలయ్యేలా సంబంధిత మండల అధికారులు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ పేర్కొన్నారు.

సోమవారం స్వయంసహాయక గ్రూపుల ద్వారా ఇసుక అమ్మకాలపై తహశీల్దార్లు, యంపిడిఓలు మరియు పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించి పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 40ఇసుకరీచ్‌లను గుర్తించామని, తద్వారా ప్రతిరోజూ 8,000క్యూబిక్ మీటర్లు ఇసుక అమ్మకాలు జరిగేలా నిర్దేశించడం జరిగిందన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంలో తహశీల్దార్లు, యంపిడిఓలు మరియు పోలీస్ అధికారుల సమన్వయంతో మండలస్థాయి కమిటీలను నిర్వహించి ఆయా రీచ్‌ల పరిధిలో ఇసుక రవాణాపై సమీక్షించుకొని, నిబంధనల మేరకు స్వయంసహాయక గ్రూపుల ద్వారా పటిష్టంగా జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. స్వయం సహాయక గ్రూపులను ప్రలోభపెట్టేవారిని గుర్తించి వారిపై కేసులు నమోదుచేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుక అమ్మకాలలో వినియోగదారులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరకు విక్రయించే చర్యలు తీసుకోవాలన్నారు. ఎడ్లబండ్లపై ఇసుక రవాణా చెల్లింపుల ద్వారానే సరఫరా చేయాలని ఆదేశించారు. దీనిపై ఎడ్ల బండ్ల యజమానుల సమన్వయంతో సమావేశం ఏర్పాటుచేసి అవగాహన కల్పించాలని మండల అధికారులను ఆదేశించారు. ఇసుక కొనుగోలును మీ సేవ కేంద్రాల ద్వారా కూడా వినియోగదారులు నగదును జమచేయవచ్చునని ఆయన అన్నారు. సంబంధిత వాహనాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అక్రమ ఇసుక రవాణా జరగకుండా మండలస్థాయి అధికారులు ఆయా రీచ్‌ల పరిధిలో పర్యవేక్షించి చర్యలు తీసుకోవాలన్నారు.

జిల్లా ఎస్పి సెంథిల్‌కుమార్ మాట్లాడుతూ మహిళా సంఘాల ద్వారా జరిగే ఇసుక రవాణాను ఆయా రీచ్‌ల పరిధిలో స్థానిక పోలీసు అధికారులు ప్రతిరోజు పర్యవేక్షించి సక్రమంగా జరిగేలా చూడాలన్నారు. ఈ ప్రక్రియలో దళారులు, రాజకీయ నాయకుల ప్రమేయం లేకుండా పారదర్శకంగా జరిగేలా చూడాలన్నారు.

ఈ సమావేశంలో డిఆర్‌డిఏ పిడి చంద్రమౌళి, జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వహణాధికారి జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ఎవరెస్టు శిఖరాన్ని ఎక్కి దేశ బాలికల సత్తా చాటా

ప్రపంచప్రసిద్ధి చెందిన ఎవరెస్టు శిఖరాన్ని ఎక్కి ఈ దేశ బాలికల సత్తా ఏంటో చాటానని ఎం.పూర్ణ పేర్కొన్నారు. నెల్లూరుజిల్లా సంగం బాలికల గురుకుల పాఠశాలలో ఇటీవల ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన ఎం.పూర్ణ, ఆనందల సత్కార కార్యక్రమం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళదేవి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని విజేతలిద్దరిని సత్కరించారు. ఈ సందర్భంగా పూర్ణ మాట్లాడుతూ శిక్షణ పూర్తిచేసుకుని ఎవరెస్టును అధిరోహించే సమయంలో ఎన్నో అవరోధాలు ఎదురైనా వాటిని అధిగమించి 8,848మీటర్ల ఎత్తయిన ఈ శిఖరానికి ఈ యేడాది మే25వ తేదీన చేరుకుని అక్కడ బిఆర్ అంబేద్కర్, ఎస్ఆర్ శంకరన్ చిత్రపటాలను ప్రతిష్టించడం తన జీవితంలో మరచిపోలేని మధుర క్షణాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వెంకటేశ్వర్లు, ఎక్సైజ్ సిఐ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఖోఖో ఛాంపియన్‌లుగా నెల్లూరు-ప్రకాశం



మహిళల విభాగంలో విజేతగా నిలిచిన నెల్లూరు జట్టు



పురుషుల విభాగంలో విజేతగా నిలిచిన ప్రకాశం జట్టు

రాష్ట్రస్థాయి యువతరంగం-2014 ఖోఖో ఛాంపియన్‌షిప్ పోటీల్లో మహిళా విభాగంలో నెల్లూరు జట్టు ఛాంపియన్‌షిప్ సాధించి నెల్లూరు ఖ్యాతిని నిలబెట్టింది. యువతరంగం క్రీడల్లో భాగంగా నెల్లూరులోని డికెడబ్ల్యు కళాశాలలో రెండు రోజుల పాటు జరిగిన ఖోఖో రాష్ట్ర స్థాయి పోటీలు ఈ నెల 23వ తేదీతో ముగిశాయి. ఎంతో ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోటీల్లో మహిళల విభాగంలో నెల్లూరు జట్టు విజయం సాధించింది. ద్వితీయస్థానాన్ని అనంతపురం జట్టు సాధించగా, తృతీయ స్థానాన్ని పశ్చిమగోదావరి జట్టు కైవశం చేసుకుంది. అదేవిధంగా, పురుషుల విభాగంలో ప్రకాశం జిల్లా జట్టు విజేతగా నిలిచింది. నెల్లూరుజట్టు ద్వితీయ స్థానం సాధించగా, అనంతపురం జట్టు తృతీయ స్థానం సాధించింది. ఈ సందర్భంగా యువతరంగం ఖోఖో పోటీల రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఎస్.నతానియల్ విజేతలకు ట్రోఫీలను, ప్రశంసాపత్రాలను అందజేశారు. యువత చదువుతోపాటు, క్రీడల్లోనూ రాణించాలని ఆయన అన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో చదువుకునే విద్యార్థుల్లో దాగివున్న క్రీడా ప్రతిభను వెలుగులోకి తెచ్చేందుకు యువతరంగం కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతోందన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫిజికల్ డైరెక్టర్ల అసోసియేషన్ అధ్యక్షులు ఆసిఫ్ కమల్‌బాషా, యువతరంగం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రవీంద్రమ్మ, డికెడబ్ల్యు కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ ఉదయభాస్కర్, గురుప్రసాద్, కె.సనత్‌కుమార్, సివి సురేష్, డి.ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బంగారు వేలం ప్రకటనతో

# రైతుల్లో ఆందోళన

నెల్లూరుజిల్లా వాకాడు మండలంలోని రైతులు వివిధ బ్యాంకుల్లో వ్యవసాయం పెట్టుబడుల కోసం తాకట్టుపెట్టిన బంగారు నగలను వేలం వేస్తున్నట్లు సోమవారం బ్యాంకు వారు ఇచ్చిన పత్రికా ప్రకటనతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రుణమాఫీ జరుగుతుందనే ఆశతో ఇప్పటివరకు ఎదురుచూసిన రైతులకు ప్రభుత్వం నిరాశను మిగల్చడంతో, భారం రెండింతలయిందని, పలు రకాల కమిటీలతో కాలయాపన చేస్తూ చివరికి మొండిచేయి చూపడంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు. బంగారు వేలం ప్రకటన చూసి రైతులు బ్యాంకుల వద్దకు పరుగులు తీసి, తమకు సమాచారం ఇవ్వకుండా నగలను వేలం వేయడం ఎక్కడి ధర్మమంటూ అధికారులను నిలదీశారు.

# అధికారం కోసం అలివికాని హామీలు

**- వైయస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసన్న ఘాటు విమర్శ**

అధికారం కోసం అలివికాని హామీలు ఇచ్చి ఇప్పుడు అధికారం చేతిలో వున్నా ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకుండా దేశంలోని ప్రథమ మోసగాడిగా ముఖ్యమంత్రి చంద్రబాబు గుర్తింపుపొందారని వైయస్సార్‌సిపి జిల్లా అధ్యక్షుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఘాటైన విమర్శలు చేశారు. ఆదివారం నెల్లూరుజిల్లా చిల్లకూరులో పార్టీ మండల కన్వీనర్ ఎద్దల మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో అనుబంధ సంఘాల కమిటీల ఎంపిక నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు రుణమాఫీ చేస్తానని ప్రకటించిన చంద్రబాబు అధికారంలోకి వచ్చి 6నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా రుణమాఫీ చేసిన దాఖలాలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి, సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, వైయస్సార్సీపీ సిఇసి సభ్యుడు ఎల్లసిరి గోపాలరెడ్డి, గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తదితరులు మాట్లాడారు.

***5న కలెక్టరేట్ వద్ద ధర్నా :*** రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న ప్రభుత్వ తీరును నిరసిస్తూ కలెక్టరేట్ వద్ద డిసెంబర్ 5న నిర్వహించే మహాధర్నాకు నెల్లూరుజిల్లాలోని వైయస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని జిల్లా అధ్యక్షుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు.

# సంక్షోభంలో విద్యారంగం

**- విఠపు ఆవేదన**



విద్యా రంగం సంక్షోభంలో పడిపోయిందని, నిరుపేదలు, బడుగు వర్గాల ప్రజలకు విద్య అందని ద్రాక్షగా మారిందని ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం ఆవేదన వ్యక్తం చేశారు. కావలిలోని విశ్వోదయ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో ఈ నెల 23న జరిగిన యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యా రంగం సంక్షోభానికి ప్రభుత్వ విధానాలే కారణమని విమర్శించారు. విద్యారంగం దుస్థితిని పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది పిల్లలు ప్రభుత్వ పాఠశాలలకు దూరమవుతున్నారని, చిన్న పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మరో ఎమ్మెల్సీ వై. శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగం పూర్తిగా వెనుకబడిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో నాగార్జున యూనివర్సిటీ పొలిటికల్‌సైన్స్ విభాగం అధిపతి ఆచార్య వి.అంజిరెడ్డి, డిబిఎస్ ఇంజనీరింగ్ కాలేజీ ఛైర్మెన్ దామిశెట్టి శ్రీనివాసులునాయుడు, టిడిపి నాయకులు తిరివీధి ప్రసాద్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు జానకిరాం, యుటిఎఫ్ నాయకులు ఎల్.గుణశేఖరరెడ్డి, అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ శ్రీహరి, నాయకులు డి.గోపాల్, కొండాచారి, శంకరయ్య, డాక్టర్ ఎంవి రమణయ్య, రమాదేవి, బాబురెడ్డి, పరంధామయ్య, బి.శ్రీదేవి, చలపతిశర్మ, టివిఎంఎస్ ప్రకాశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల

# చట్టాన్ని క్రమబద్ధీకరించాలి

భవన నిర్మాణ కార్మికుల చట్టాన్ని ప్రభుత్వం క్రమబద్ధీకరించి సక్రమంగా అమలు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు ఎం. గురవయ్య డిమాండ్ చేశారు. ఈ నెల 23న నెల్లూరు సమీపంలోని పొట్టేపాళెంలో జరిగిన ఆ సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ, భవన నిర్మాణ కార్మికులకు గుర్తింపునివ్వాలని కోరారు. అదేవిధంగా, కార్మికుల సంక్షేమానికి సంబంధించిన కోట్లాదిరూపాయల నిధులను సద్వినియోగం చేయాలని, భవన నిర్మాణ కార్మికులను సంక్షేమ బోర్డులో చేర్చాలని, కార్మికులకు రూ. 2వేల వంతున పింఛన్ సదుపాయం కలిగించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం రూరల్ నియోజకవర్గం కార్యదర్శి మాదాల వెంకటేశ్వర్లు, నాయకులు పి. చంద్రమౌళి, ఆలూరు తిరుపాలు, వెంకట్రావ్, గోపాల్, నాగయ్య, జితేంద్రబాబు, మీరామొహిద్దీన్, ఇసాక్, అంకయ్యలు పాల్గొన్నారు.

# మౌలిక సదుపాయాలు కల్పించాలి

నెల్లూరుజిల్లా ముత్తుకూరు మండలంలోని ప్రాజెక్టుల యాజమాన్యాలు తమ ప్రభావిత గ్రామాల్లో కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ(సిఎస్ఆర్) నిధులతో మౌలిక సదుపాయాలు కల్పించాలని సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ముత్తుకూరులో సోమవారం గ్రీవెన్స్‌సెల్‌లో పాల్గొన్న అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ప్రాజెక్టుల సమీపంలోని గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, వీధిలైట్లు తదితర సౌకర్యాల కల్పనకు సిఎస్ఆర్ నిధులు ఖర్చు చేయాలన్నారు. నిరుద్యోగ యువకులను స్కిల్, అన్‌స్కిల్, సెమీస్కిల్‌గా విభజన చేసి, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. సెప్టెంబర్ 30వ తేదీన జరిగిన ఐఎబి సమావేశంలో సాగునీటి పారుదలకు చేసిన సూచనలు అమలు కాలేదన్నారు. ఇలాగైతే రైతుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని ఇరిగేషన్ ఇంజనీర్లను హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంపిపి వెంకటసుబ్బయ్య జడ్పీటీసీ నెల్లూరుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




# 'వాత్సల్య' సేవలు ఆదర్శప్రాయం

నెల్లూరులోని వాత్సల్య సేవా సంస్థ నిరుపేద బాలబాలికలు, అనాథలకు చేస్తున్న సేవలు ఎంతో ఆదర్శప్రాయమని, ఈ సేవాసంస్థకు తనవంతు సహకారాన్నందజేస్తామని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం వాత్సల్య కార్యాలయంలో ఏర్పాటుచేసిన ఆత్మీయసమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సేవా సంస్థలో చిన్నారులకు వసతి, ఉచిత భోజన సదుపాయం కల్పించడమేకాక, సుమారు మూడువందల మంది విద్యార్థులకు ఉచిత విద్యను అందించడం, అనాథలైన వృద్ధులకు చేయూతనందిస్తుండడం ఎంతో అభినందనీయమన్నారు. వాత్సల్య సంస్థకు ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఈ ఆత్మీయ సమావేశంలో వాత్సల్య సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఇష్టానుసారంగా రోడ్ల విస్తరణ అన్యాయం



వ్యాపారులనుద్దేశించి ప్రసంగిస్తున్న ఆనం వివేకానందరెడ్డి

నెల్లూరులో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ పేరుతో ప్రభుత్వం ఇష్టానుసారంగా రోడ్ల విస్తరణ కార్యక్రమం చేపట్టడం న్యాయం కాదని మాజీ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి అన్నారు. బుధవారం నెల్లూరు వేదాయపాళెంలో జరిగిన వ్యాపారుల అవగాహన సదస్సులో వివేకా మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో మూడుసార్లు రోడ్ల విస్తరణ చేపట్టామని, దీంతో వ్యాపారులు తీవ్రంగా నష్టపోవడంతో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రస్తుతం టిడిపి ప్రభుత్వం మాస్టర్‌ప్లాన్ పేరుతో రోడ్ల విస్తరణకు మార్కింగ్ చేపట్టడంతో వ్యాపారులు ఆందోళనకు గురవుతున్నారని ఆయన అన్నారు. ఇష్టానుసారంగా చేపట్టే రోడ్ల విస్తరణ వల్ల వేలాది కోట్ల రూపాయల ఆస్తి నష్టం జరగడమే కాక, వేలాది కుటుంబాల జీవనం కూడా అస్తవ్యస్తంగా మారుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ఆమోదంతో న్యాయంగా చేపట్టాల్సిన ఇలాంటి కార్యక్రమాన్ని ఏకపక్షంగా చేపట్టడం ఎంతైనా అన్యాయమని ఆయన అన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఎన్నో మార్గాలు వుండగా, అధికారులు మాత్రం కూల్చివేతకే మొగ్గు చూపుతుండడం బాధాకరమన్నారు. దాదాపు 30 ఏళ్ళుగా జీవనం సాగిస్తున్న వ్యాపారులకు అన్యాయం చేయడం సముచితం కాదని, దీనిపై అందరం కలసి సమిష్టిగా న్యాయపరంగా ప్రజాపోరాటం చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఏసి సుబ్బారెడ్డి, ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి, కొమ్మి శంకరయ్య, రాజేష్, దిలీప్, పేరారెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

## చూడముచ్చటగా వున్న 'లాయర్' చిన్నారుల విజయదీపిక




బాలల దినోత్సవం సందర్భంగా 'లాయర్' వారపత్రికవారు ప్రచురించిన 'చిన్నారుల విజయ దీపిక' ఎంతో బావుంది. ఎంతగానో శ్రమకోర్చి, ఉన్నత ప్రమాణాలతో ప్రచురించిన ఈ విజయదీపిక ముద్దుమురిపాల పాపలా.. చూడముచ్చటగా వుంది. ప్రతిభావంతులు, ప్రజ్ఞా వంతులైన నెల్లూరు చిన్నారుల గురించి బయట ప్రపంచానికి తెలిపి 'లాయర్' ధన్యత పొందింది. ఈ పాపలందరూ 'చిన్నారుల విజయదీపిక'ను చిరకాలం గుర్తుంచుకుంటారు. పదిలపరుచుకుంటారు. ఇలాంటి సాహసోపేత ప్రయత్నం నాకు తెలిసి నంతవరకు దేశంలో ఎక్కడా జరగలేదు. అందుకు 'లాయర్'కు నా అభినందనలు.. ఆశీస్సులు.



- 'బాలబంధు'
**డాక్టర్ వెలగా వెంకటప్పయ్య,**
4-54-19, ఐతానగరం, తెనాలి-522 201

# పేదల కలల పంట.. మాగుంట

## కావలిలో ఘనంగా మాగుంట సుబ్బరామిరెడ్డి విగ్రహావిష్కరణ

దివంగత నేత మాగుంట సుబ్బరామిరెడ్డి ప్రజోపయోగం కోసం ఎన్నో కార్యక్రమాలు నిర్వర్తించారని, ఆయన సమాజానికి చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశయాల బాటలో నడుస్తామని మాగుంట సుబ్బరామిరెడ్డి తనయుడు మాగుంట విజయ్‌రెడ్డి అన్నారు.

కావలిలోని వెంగళరావునగర్‌లో ఈ నెల 26న, అభివృద్ధి ప్రదాత, దివంగత నేత మాగుంట సుబ్బరామిరెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మాగుంట విజయ్‌రెడ్డి పాల్గొని మాగుంట సుబ్బరామిరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం విజయ్‌రెడ్డి మాట్లాడుతూ మాగుంట సుబ్బరామిరెడ్డి భౌతికంగా లేకపోయినా, ప్రజల హృదయాల్లో ఆయన చిరస్థాయిగా నిలచిపోయారని, ప్రజల కోసం ఆయన చేసిన సేవలు అపారమైనవని అన్నారు. తన తండ్రి ఆశయాలను కొనసాగిస్తామని అన్నారు.

మాజీ కౌన్సిలర్ రాజ్‌కుమార్ చౌదరి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి, బొల్లినేని రామారావు, మాజీఎమ్మెల్యే బీద మస్తాన్ రావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా, ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పేద, బడుగు వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం దివంగత నేత మాగుంట సుబ్బరామిరెడ్డి చేసిన సేవలు ఎన్నటికీ మరచిపోలేనివని కొనియాడారు. ఎమ్మెల్యే బొల్లినేని రామారావు మాట్లాడుతూ మాగుంట సుబ్బరామిరెడ్డి ప్రజల మనిషి అని, అన్ని వర్గాల ప్రజలకు, సమాజానికి ఆయన మహోన్నతమైన సేవలందించారని ప్రశంసించారు. ఈ సందర్భంగా 40 మంది గిరిజనులకు సైకిళ్ళను పంపిణీ చేశారు.


సుబ్బరామన్నకు విద్యార్థినుల నివాళి


విగ్రహావిష్కరణ సభలో మాట్లాడుతున్న మాగుంట విజయ్‌రెడ్డి

ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్‌పర్సన్ ఆలేఖ్య, వైస్ ఛైర్మన్ భరత్‌కుమార్, డిఎస్పీ మోహన్‌రావు, ఎఎంసి మాజీ ఛైర్మన్ గ్రంధి యానాదిశెట్టి, బిసి సంక్షేమ సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు దేవరాల సుబ్రహ్మణ్యం, రైతు సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు మలిరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి, టిడిపి పట్టణ కమిటీ అధ్యక్షుడు మలిశెట్టి వెంకటేశ్వర్లు, నాయకులు మెట్టుకూరు చిరంజీవిరెడ్డి, కృష్ణారెడ్డి, మన్నెమాల గోవిందరెడ్డి, దామిశెట్టి శ్రీనివాసులునాయుడు, నగళ్ళ శ్రీనివాసకిరణ్, అమరా వేదగిరి, సుబ్బరాయుడు గుప్తా, తిరివీధి ప్రసాద్, చింతాల వెంకట్రావ్, కనమర్లపూడి నారాయణ, ఎస్‌కె రషీద్, పద్మావతి శ్రీదేవి, పర్వీన్‌జానీలతో పాటు మాగుంట అభిమానులు పెద్దసంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


## ఉత్తరక్రియలు





మానవత్వం మూర్తీభవించిన
మంచివ్యక్తి,
మాకు ప్రేమానురాగాలు పంచిన
అమృతమూర్తి,
మా ఇంటి దైవం

**శ్రీ తుమ్మల వెంకట రమణారెడ్డి గారు**

తేది. 19.11.2014 బుధవారం స్వర్గస్తులైనారు.
వారి పవిత్రాత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...

భార్య: తుమ్మల సుమన
కుమారుడు: తుమ్మల విలాస్‌రెడ్డి    కుమార్తె: వి.లాలస
మరియు కుటుంబసభ్యులు

ఉత్తరక్రియలు: తేది. 4.12.2014 గురువారం
ఉదయం 10.30గంటలకు నెల్లూరు రామ్మూర్తినగర్‌లోని
మా స్వగృహము నందు జరుగును. కావున తెలియజేయడమైనది.

# 'ప్రభా'తం

స్నేహబంధం నిజంగానే ఎంతో మధురమైనది. లేనిపోని విభేదాలతో, మనసును కష్టపెట్టుకుంటూ ఎల్లకాలమూ బాధపడేకంటే, స్నేహసౌహార్ధభావ వీచికలతో, ఆత్మీయతానుబంధాలతో జీవితాలను శుభ్రప్రదం చేసుకోవచ్చు. ఇది అందరికీ తెలిసిన సత్యమే అయినా, దానిని అక్షరాలా ఆచరణలో పెట్టి స్నేహసుగంధ పరిమళాలను విశ్వవ్యాప్తిచేయడంలో ప్రధాని నరేంద్రమోడీ తీసుకుంటున్న చొరవ అపారం..అమోఘం. అందుకే, ఆయన ఇరుగు పొరుగు దేశాలకు సైతం స్నేహహస్తం సాచి, విభేదాలతో సాధించలేని అనేక అంశాలను ఆత్మీయమైన మైత్రీభావంతో సాధించుకొస్తున్నారు. అమెరికా, ఆస్ట్రేలియా లాంటి అగ్రరాజ్యాలే ఆయనకు ఘనస్వాగతాలు పలికాయంటే, అది ఆయన స్నేహభావానికీ, నిజాయితీకి నిదర్శనం. అద్భుతమైన వాక్పటిమకు, నిర్మోహమాటానికీ, నిష్కాపట్యానికీ ఆయన ప్రతీక. చెప్పదలచుకున్న నాలుగు మాటలూ స్పష్టంగా, సూటిగా..నిర్భీతిగా చెప్పేయడం ఆయన నైజం. అదే ఆయనకు విశ్వవ్యాప్త ఖ్యాతిని తెచ్చిపెడుతోందనవచ్చు. పొరుగు దేశాలతో సన్నిహిత సంబంధాలకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని..ఆయన ఈ నెల 25న న్యూఢిల్లీ నుంచి ఖాట్మండ్‌కు బయలుదేరే ముందు కూడా స్పష్టంగా తెలియజేశారు. అంతేకాదు, చెప్పిన మాటలను ఆచరణలోకి తేవడంలోనూ ఆయన తీసుకుంటున్న చొరవ మరింత ప్రత్యేకత సంత రించుకుంటోంది. నేపాల్‌లో జరుగుతున్న సార్క్ శిఖరాగ్రసమావేశంలో పాల్గొనేందుకు ఆయన బయలుదేరివెళ్ళారు. అక్కడి ప్రధాని సుశీల్ కొయిరాలాతో కలిసి, ఖాట్మండ్‌లో మనదేశం నిర్మించిన ట్రామా సెంటర్‌కు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా, ప్రధాని మోడీ మాట్లాడుతూ, 18వ సార్క్ దేశాల సదస్సు శాంతి సౌభాగ్యాల కోసం భారత్ లోతైన ప్రాంతీయ సమైక్యతపై దృష్టి సారిస్తుందని, దక్షిణాసియా ప్రాంతం సాంఘిక, ఆర్థిక అభివృద్ధి కోసం అన్ని స్థాయిల్లోనూ అత్యధిక ప్రాంతీయ సమైక్యతకు భారత్ ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. అంతేకాదు, నేపాల్ రాజ్యాంగ రచనను సత్వరమే పూర్తి చేయాలని, రాజ్యాంగం లేకపోతే కష్టాలు ఎదురవుతాయని, అందరూ కలిసి ఏకాభిప్రాయంతో, అన్నివర్గాల ప్రజల ఆకాంక్షలు ప్రతిబింబించే విధంగా, రాజ్యాంగాన్ని తయారుచేసుకోవాలని నేపాల్ నేతలకు ఆయన సూచించారు. అందుకు నేపాల్ ప్రధాని స్పందిస్తూ, వచ్చే ఏడాదికి రాజ్యాంగాన్ని రూపొందించగలమన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఇలా ఇరుగుపొరుగుదేశాలతో స్నేహపూర్వక సంబంధాలను కొనసాగించడం దేశప్రతిష్టను మరింతగా ఇనుమడించేదేనని వేరే చెప్పనక్కర లేదు.

ఒక్క నేపాల్ విషయంలోనే కాదు, ఆయన ఏ దేశానికి వెళ్ళినా తనదైన వాణి వినిపిస్తూనే వున్నారు. ధీరోదాత్తమైన, ఆచరణాత్మకమైన మంచి నిర్ణయాలతో, ప్రజల అభ్యున్నతినీ, ప్రపంచవ్యాప్తంగా ప్రజలందరి ప్రగతినీ కాంక్షిస్తూ ఆయన చేస్తున్న ప్రసంగాలు అందరి ప్రశంసలు అందుకుంటున్నాయి. దేశవ్యాప్తంగానే కాక విశ్వవ్యాప్తంగా భారతీయతను చాటుతూ, ప్రజలందరి శాంతి సౌభాగ్యాలను ఆకాంక్షిస్తున్న ప్రధాని మోడీ ప్రసంగాలు అందరినీ ఉర్రూతలూగిస్తున్నాయి.

సరిగ్గా ఆరునెలల క్రితం మే 26న ఆయన ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన రోజునే సార్క్ దేశాధినేతలను ఆహ్వానించి గౌరవించడం ఆయన విజ్ఞతకు..అనుభవజ్ఞతకు ఒక చిన్న ఉదాహరణ. ఈ ఆరు నెలల కాలంలోనే ఒకవైపు దేశంలో ఎన్నడూలేని విధంగా సంస్కరణలు చేపట్టి, దేశాన్ని ప్రగతి బాటన పెట్టి, ప్రజలందరి ఆదరాభిమానాలు పొందారు. ముఖ్యంగా అస్తవ్యస్తమైపోయివున్న ఆర్థికవ్యవస్థను ఒక గాడిన పెట్టి, ద్రవ్యోల్బణాన్ని అదుపులోకి తెచ్చి, అనేక రంగాల్లో ప్రగతిని సాధించేందుకు మార్గం వేశారు. ప్రభుత్వ యంత్రాంగంలోనూ మునుపెన్నడూ లేని విధంగా మార్పులు తెచ్చి పాలనను వేగవంతం చేశారు. ఆర్థిక సంస్కరణలను వేగవంతం చేస్తున్నారు. మేకిన్ ఇండియా కార్యక్రమం చేపట్టి విదేశీ పెట్టుబడులను ఆకర్షిస్తూ భారత్‌లో తయారీరంగం ఏర్పాటుకు బాటలు వేస్తున్నారు. మరోవైపు పార్టీపరంగా కూడా, బిజెపిని ఒక తిరుగులేని శక్తిగా నిరూపిస్తూ, ఇటీవలే జరిగిన మహారాష్ట్ర, హర్యానా ఎన్నికల్లో బిజెపి విజయకేతనాన్ని ఎగురవేశారు. ముఖ్యంగా మహారాష్ట్రలో పాతికేళ్ళుగా కలసివుంటున్న శివసేన బెదిరింపులకు ఏమాత్రం చలించకుండా, ఒంటరిగానే పోరాటం చేసి, ఎన్నికల్లో నిలచి గెలిచి తమ సత్తా ఏమిటో నిరూపించుకున్నారు. అదే సందర్భంలో, ఇతర దేశాల్లోనూ భారత దేశ ఖ్యాతి మార్మోగేవిధంగా తన పర్యటనలతో అనూహ్యమైన విజయాలెన్నిటినో సాధించారు. ఈ ఆరు నెలల కాలంలోనే తొమ్మిది విదేశీపర్యటనలు చేశారు. జూన్‌లో భూటాన్‌లోనూ, జులైలో బ్రెజిల్‌లోనూ, ఆగస్టులో నేపాల్‌లోనూ, సెప్టెంబర్‌లో అగ్రరాజ్యమైన అమెరికాలోనూ పర్యటించి అందరినీ మెప్పించే అద్భుతమైన ప్రసంగాలు చేశారు. ఆలోచనాత్మకమూ.. ఆచరణాత్మకమూ అయిన నిర్ణయాలతో, ప్రపంచానికి వున్న పెనుసవాళ్ళకు ధీటైన సమాధానాలతో ఆయన ఆయా దేశాల అధినేతలు, ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నారు. అంతేకాదు, ప్రపంచానికి పెనుభూతంలా విస్తరిస్తున్న ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించేందుకు అందరూ సమాయత్తం కావాలని ఆయన పలుదేశాల సమావేశాల్లో ఇచ్చిన పిలుపు ప్రపంచమంతా ప్రతిధ్వనించింది. ఒక్కమాటలో చెప్పాలంటే, మోడీ మాట మంత్రమై మార్మోగింది. ఒక్క నవంబర్ నెలలోనే ఆయన మూడు దేశాల్లో పర్యటించారు. మయన్మార్, ఆస్ట్రేలియా, ఫిజీల్లో పర్యటించి ఆయా దేశాలతో సన్నిహిత సంబంధబాంధవ్యాలకు వారధిగా నిలిచారు. ఆయన ఎక్కడకు వెళ్ళినా ప్రవాసభారతీయులనుద్దేశించి ప్రసంగిస్తూ, మాతృదేశానికి తమవంతు కృషిచేయాలని పిలుపునివ్వడం అందరిలో ఎంతో మంచి స్ఫూర్తిని కలిగిస్తోంది. వచ్చే ఏడాది శ్రీలంక, బ్రిటన్, జర్మనీ, రష్యా తదితర దేశాల్లో పర్యటించేందుకు ఆయన రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం. తానెక్కడికి వెళ్ళినా భారతీయతను చాటుతూ, ప్రజలకు మేలైన ప్రగతిని అందించేందుకు తనవంతు అనితరసాధ్యమైన కృషినే చేస్తున్నారు. చెలిమితోనే బలిమి, కలిమి సాధ్యమవుతాయనే రీతిలో ప్రధాని మోడీ ఇరుగుపొరుగు దేశాలతో ఇలా అరమరికలు లేని మైత్రీసంబంధాలను కొనసాగిస్తుండడం మన దేశానికే కాదు, ఆయా దేశాల నేతలకు, ప్రజలకు సైతం ఆనందాన్నే కలిగిస్తోందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

## స్నేహానుబంధం



ప్రధాని మోడీ ఏ దేశానికి వెళ్ళినా తనదైన వాణి వినిపిస్తూనే వున్నారు. ధీరోదాత్తమైన, ఆచరణాత్మకమైన మంచి నిర్ణయాలతో, ప్రజల అభ్యున్నతినీ, ప్రపంచవ్యాప్తంగా ప్రజలందరి ప్రగతినీ కాంక్షిస్తూ ఆయన చేస్తున్న ప్రసంగాలు, నిర్ణయాలు అందరి ప్రశంసలు అందుకుంటున్నాయి. దేశవ్యాప్తంగానే కాక విశ్వవ్యాప్తంగా భారతీయతను చాటుతూ, ప్రజలందరి శాంతి సౌభాగ్యాలను ఆకాంక్షిస్తున్న ప్రధాని మోడీ ప్రసంగాలు అందరినీ ఉర్రూతలూగిస్తున్నాయి.

నివాస ప్రాంతంలో..

# సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్దు

### జిల్లా కలెక్టర్‌కు వినతి



నెల్లూరు బాలాజీనగర్‌లోని లక్ష్మీనగర్ (గీతాంజలి స్కూలు-పుట్టవీధి మధ్య) నివాస ప్రాంతంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని పెట్టకుండా మరేదైనా ప్రజలందరికి అనుకూలంగా ఉండే ప్రాంతంలో స్టోన్‌హౌస్‌పేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోవాలని నెల్లూరుజిల్లా కలెక్టరేట్‌కు లక్ష్మీనగర్ ఎక్స్‌టెన్షన్ ఏరియా రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి జి.వి.నాగరాజారావు వినతిపత్రం సమర్పించారు. ఇటువంటి ఆఫీసులు పెట్టడం వల్ల స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. నిరంతరం స్కూలు బస్సులు, పార్కుకు వెళ్లే ప్రజలు ఇప్పటికే ట్రాఫిక్ సమస్యలతో అవస్థలు పడుతున్నారన్నారు. పార్కింగ్ ఏరియా కూడా లేని ప్రాంతంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పెడితే పబ్లిక్ టాయ్‌లెట్లుగా వాడుకుని ఈ ప్రాంతాన్ని మరీ కంపుకొట్టించే అవకాశముందన్నారు. ఇళ్ళ మధ్యలో ప్రజలకు సరైన రవాణా సౌకర్యంలేని ప్రాంతంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నెలకొల్పటం సముచితం కాదన్నారు. నవాబుపేట, బంగ్లాతోట ప్రాంతంలోనే మరోచోట ఏర్పాటు చేసుకోవాలని ఈ ప్రాంత మహిళలు, విద్యార్థులు, ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు.

# మీ సేవ ద్వారానే లేబర్ లైసెన్స్ రెన్యూవల్

దుకాణాలు, సంస్థలు రిజిస్ట్రేషన్ రెన్యూవల్స్ ఇకమీదట మీసేవ ద్వారా నిర్వహించుకోవాలని, కార్మికశాఖ కార్యాలయంలో రెన్యూవల్స్ జరగవని ఆంధ్రా ఛాంబర్ ఆఫ్ కామర్స్(చెన్నై) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.వి.చలమయ్య తెలిపారు. దరఖాస్తు ఫారం-1(సిరూల్స్-3) స్టేట్‌మెంట్, ఫారం-111(సిరూల్-4) ఈ ఫారములు కార్మికశాఖ కార్యాలయంలో గాని మీ సేవలో గాని, మీసేవ వెబ్‌సైట్ల ద్వారా పొందవచ్చని తెలిపారు. రెన్యూవల్స్ సమయంలో కార్మికులు ఆధార్‌కార్డు జెరాక్స్ కాపీలు జత చేయాలని, 5మందికన్నా ఎక్కువ కార్మికులు ఉన్నవారు కార్మికుల పేర్లు దరఖాస్తులో నింపాలన్నారు. ఉద్యోగులు లేని సంస్థలు, దుకాణాలు ప్రతిసంవత్సరం రూ.30లు, ఉద్యోగులు 1 నుంచి 5వరకు రూ.100లు, 6 నుంచి 10వరకు రూ.200లు, 11నుంచి 20వరకు రూ.350, 21 నుంచి 50వరకు రూ.1000లు, 51 నుంచి 100వరకు రూ.2000లు, 101 నుంచి అంతకుమించిన వారు రూ.2,500లు చెల్లించాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ రెన్యూవల్స్ డిసెంబర్ 1తేది వరకు అపరాధరుసుము ఉండదని, డిసెంబర్ 2 నుంచి 31వరకు 25శాతం పెనాల్టీతో, జనవరి 1 నుంచి 50శాతం పెనాల్టీతో రుసుము చెల్లించాలన్నారు. దీంతోపాటు కాంపౌండ్ ఫీజు, లేబర్ వెల్ఫేర్ ఫండ్ చెల్లించాలన్నారు. గతంలో ఉన్నట్లు గుమస్తా లేని దుకాణంవారు సెలవురోజులు, ప్రభుత్వం ప్రకటించిన సెలవులు, ఆదివారాలు కూడా దుకాణాలు తెరచి వ్యాపారం చేసుకోవచ్చని తెలిపారు.

## 'లాయర్' చిన్నారుల విజయదీపిక అత్యద్భుతం

బాలల దినోత్సవం సందర్భంగా 'లాయర్' పత్రిక వారు ప్రచురించిన "చిన్నారుల విజయదీపిక" ఆద్యంతం అద్భుతంగా ఉంది. ముద్రణ, నాణ్యత అమోఘం. ఈ పత్రికను చదివిన తర్వాత నెల్లూరులో ఇంతమంది ప్రతిభావంతులైన బాలబాలికలున్నారా అని ఆశ్చర్యం కలిగింది. ఇంతమంది బాలబాలికల ప్రతిభను వెలుగులోకి తెచ్చినందుకు 'లాయర్' యాజమాన్యానికి అభినందనలు.

*- 'బాలబంధు' డా॥ వెలగా వెంకటప్పయ్య, తెనాలి.*

## సింగపూర్ రాజధాని అర్జంటా?

సింగపూర్ లాంటి రాజధానిని అర్జంట్‌గా కట్టకపోతే ఈ రాష్ట్ర ప్రజలు బ్రతకలేరన్నట్లుగా వుంది ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవహారం. రాష్ట్రానికి రాజధాని అత్యవసరం కాదు. పదేళ్లదాకా హైదరాబాద్‌కు గడువుంది. రాజధాని పేరుతో విదేశీయాత్రలు చేయడం సముచితం కాదు. వాస్తవ అభివృద్ధిపై చంద్రబాబు దృష్టి పెట్టడం లేదు.

*- ఆర్.కె.రాజు, తణుకు.*




## ఒక్క పనన్నా చేశారా?

తెలుగుదేశం అధికారంలోకి వచ్చి ఆరునెలలయ్యింది. కబుర్లతో కాలక్షేపం చేయడం తప్పించి, ఒక్క అభివృద్ధి పనికి పూనుకున్న దాఖలాలు లేవు. ఋణమాఫీ పూర్తిగా అమలుకాక రైతులు స్వర్గానికి నరకానికి మధ్యన ఉన్నారు. రైతులకు అప్పులు కూడా పుట్టడం లేదు. నెల్లూరుజిల్లాలో కాంగ్రెస్ హయాంలో ఎంతో అభివృద్ధి జరిగింది. ఇప్పుడు మాత్రం రూపాయి పనికూడా జరగడం లేదు.

*- సి.జితేంద్ర, నెల్లూరు.*

## ఆ కొంచెం విస్తరిస్తే సరిపోతుందా?

నెల్లూరు ట్రంకురోడ్డును వంద అడుగుల వెడల్పు చేస్తే నగరంలో ట్రాఫిక్ సమస్యంతా పరిష్కారమైపోతుందన్నట్లుగా అధికారులు మాట్లాడుతున్నారు. ట్రంకురోడ్డు అంతా కూడా రెండు మూడుచోట్ల ఇరుకుగా ఉంటుంది. అక్కడ వెడల్పు చేస్తే చాలు. రోడ్డును పది అడుగులు వెడల్పు చేసినంతమాత్రాన ట్రాఫిక్ తగ్గేదేమీ వుండదు. మాస్టర్‌ప్లాన్‌లో ఎన్నో కొత్త రోడ్లు వున్నాయి. ఆ రోడ్లను వేస్తే చాలు.. నెల్లూరు ట్రాఫిక్ సమస్య తీరినట్లే!

*-జి.యస్.రెడ్డి, నెల్లూరు.*




**కాంగ్రెస్‌పార్టీలో వర్గ విభేదాలు, అంతర్గత కుమ్ములాటలు కామన్. జిల్లా కాంగ్రెస్‌పార్టీలో ఈ వర్గ విభేదాలు సంప్రదాయబద్ధంగా కొన సాగుతూ వచ్చాయి. పార్టీలో నెలకొన్న అంతర్గత విభేదాలకు ఇంతకాలం జిల్లా కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంగా వున్న ఇందిరాభవన్ వేదికగా ఉంటూ వచ్చింది. అయితే ఇప్పుడు ఇంకో విచిత్రం చోటు చేసుకుంది. కాంగ్రెస్ నేతల అంతర్గత విభేదాలకు అదే ఇందిరాభవన్ కేంద్రమైంది. ఇందిరాభవన్ ఎవరి ఆస్థి అనేది ఇప్పుడు పెద్ద వివాదంగా మారింది. ఇది పార్టీ సొత్తా? లేక ట్రస్ట్ సొత్తా? అనేది ప్రశ్నార్థకంగా మారింది.**

## ✷ వివాదాలకు వేదికైన ఇందిరాభవన్

# ఇంతకీ ఇది ఎవరి సొత్తు





ఇందిరాభవన్ పార్టీ ఆస్థేనంటూ, దీనిని పార్టీ కార్యక్రమాలకే విని యోగించాలంటూ ప్రస్తుతం కాంగ్రెస్‌లో కీలక పాత్ర పోషిస్తున్న ఆనం వర్గం వాదిస్తుండగా, ఇందిరాభవన్ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి ఏర్పాటు చేసిన ఇందిరాభవన్ ట్రస్ట్‌దని నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి వాదిస్తున్నారు. ఇటీవల ఇందిరాభవన్‌లో డీసీసీ అధ్యక్షులు, నగర కాంగ్రెస్ అధ్యక్షుల సమావేశం జరుగగా ఆ సమావేశంలోనే ఇందిరాభవన్ పత్రాలను పీసీసీ అధ్యక్షులు రఘువీరారెడ్డి డీసీసీ అధ్యక్షులు కొడవలూరు ధనుంజయరెడ్డికి అందజేశారు. దీనిద్వారా ఇందిరాభవన్‌పై పెత్తనం ఆనం సోదరుల చేతుల్లోకి వచ్చినట్లయ్యింది. అయితే దీనిని స్వర్గీయ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి తనయుడు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి వెంటనే ఖండించారు. ఇందిరాభవన్ కాంగ్రెస్‌పార్టీ ఆస్థి కాదని, తన తండ్రి ట్రస్ట్ ఏర్పాటు చేసి కట్టించాడని, దీనిని కాంగ్రెస్‌పార్టీ స్వాధీనం చేసుకోలేదని చెప్పారు. గతంలోనే తన తండ్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి ఇందిరాభవన్‌కు సంబంధించిన పత్రాలను సోనియాగాంధీకి అందజేసి, దీనిని స్వాధీనం చేసుకోవాలని కోరారని, అయితే దీనిని స్వాధీనం చేసుకోవడంలో న్యాయపరమైన చిక్కులున్నాయని పేర్కొంటూ పార్టీ కోశాధికారి మోతీలాల్ బోరా తిరస్కరించారని, కాబట్టి ఇందిరాభవన్ ఇప్పటికీ ట్రస్ట్ ఆధీనంలోనే వుందని రాంకుమార్‌రెడ్డి పేర్కొనడం జరిగింది. అయితే రాంకుమార్‌రెడ్డి వ్యాఖ్యలను ఆనం వివేకా తిప్పకొట్టారు. ఇందిరాభవన్ కాదు, నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి కూడా కాంగ్రెస్ ఆస్థేనని, కాబట్టి ఇందిరాభవన్‌ను కాంగ్రెస్‌పార్టీకి అంకితం చేస్తాం తప్పితే అమ్ముకోలేమని వ్యాఖ్యానించారు.

ఎవరెన్ని వివాదాలకు పోయినా నెల్లూరులో ఇందిరాభవన్ నిర్మాణానికి రాళ్లెత్తిన కూలీ మాత్రం నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డే! 1924 నుండి నెల్లూరులో కాంగ్రెస్‌పార్టీ కార్యాలయ నిర్మాణానికి ప్రయత్నాలు జరుగుతూనే వచ్చాయి. అయితే కొన్ని న్యాయపర చిక్కుల వల్ల స్థల వివాదాలు వచ్చి ఆగిపోయింది. 1924లో ఇక్కడ స్థలం కొనుగోలు చేసారు. 1935లో భవన నిర్మాణానికి పునాదిరాయి వేసినా పనులు ముందుకు కదల్లేదు. 1959లో ఏ.సి.సుబ్బారెడ్డి ప్రస్తుతం ఇందిరాభవన్ వున్న స్థలాన్ని మున్సిపాల్టీకి 23వేల రూపాయలు చెల్లించి స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత లక్ష రూపాయల దాకా విరాళాలు పోగేసి నిర్మాణం మొదలుపెట్టారు. అయితే పునాదులతో బ్రేక్ పడింది. ఆ తర్వాత 1984వరకు పార్టీ కార్యాలయం గురించి పట్టించుకున్నవాళ్లు లేరు. 1983లో తెలుగుదేశం అధికారంలోకి వచ్చింది. రాష్ట్రంలో కాంగ్రెస్ నిర్వీర్యమైంది. జిల్లాలో పెద్ద రాజకీయ కుటుంబాలన్నీ అప్పుడు తెలుగుదేశంలోనే ఉండినాయి. నేదురుమల్లి ఒక్కడే కాంగ్రెస్‌లో ఉన్నారు. అయినా ఆయన ఇందిరాభవన్ నిర్మాణానికి పూనుకున్నాడు. 1984లో ప్రధాని రాజీవ్‌గాంధీ చేతులమీదుగా దీనిని ప్రారంభింపచేశారు. ఇందిరాభవన్ నిర్వహణ కొరకు ఒక ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి దానికి ప్రముఖ న్యాయవాది పి.వి.రమణారెడ్డిని అధ్యక్షుడిగా పెట్టారు. తర్వాతకాలంలో నేదురుమల్లే స్వయంగా ఇందిరాభవన్ పత్రాలను సోనియాకు అందజేశారు. అయితే ఇందిరాభవన్ నిర్వహణను మాత్రమే ట్రస్ట్ చూసుకుంటుందని ఆయన ఆ పత్రాలలో పేర్కొన్నారు.

అయితే ఇప్పుడు ట్రస్ట్‌తో సంబంధం లేకుండా ఇందిరాభవన్‌ను పూర్తిగా కాంగ్రెస్‌పార్టీ కంట్రోల్‌లో ఉంచేలా ఆనం వర్గం ప్లాన్ చేసింది. రాంకుమార్‌రెడ్డి ఈ విషయంలో సోనియా వద్దకైనా వెళ్తానంటున్నాడు. ఈ పంచాయితీలో ఢిల్లీ పెద్దల తీర్పు ఎలా ఉంటుందో చూడాలి.

# 'నుడా' ప్రచారార్భాటమేనా?




నెల్లూరుకు అర్బన్ డెవలప్‌మెంట్(నుడా)ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 'నుడా' అనగానే జిల్లాలోని చాలామంది తెలుగుదేశం నాయకులు ఆ సంస్థ ఛైర్మెన్ పదవి మీద ఆశలు పెట్టుకున్నారు. నెల్లూరు నగరానికి చుట్టూ వున్న మరో 5మండలాలను కలిపి 'నుడా'ను ఏర్పాటు చేయనున్నారన్నది మొదటి నుండి జరుగుతున్న ప్రచారం. ఇంతవరకు బాగానే వుంది. కాని మొన్న కమిషనర్ చక్రధర్‌బాబు జిల్లాలోని 33మండలాల పరిధిలో 'నుడా' ఏర్పాటు కానుందని పేర్కొన్నారు. ఇంకా మండలాల సంఖ్య పెరిగే అవకాశం కూడా ఉందని ఆయన సెలవిచ్చారు. అంటే దాదాపు జిల్లానంతా నుడా పరిధిలోకి తేనున్నారేమోననిపిస్తుంది. జిల్లాలో ఉండేదే 46మండలాలు. 33మండలాలను 'నుడా' లోకి తెస్తే మిగిలింది 13మండలాలు. నెల్లూరుకు దూరంగా ఉండేది ఉదయగిరి, వెంకటగిరి నియోజకవర్గాలలోని మండలాలే. సూళ్లూరుపేటలో తడ, పెళ్లకూరు మండలాలు దూరంగా ఉంటాయి. కాబట్టి ఈ మండలాలను మినహాయించి మిగిలిన అన్ని మండలాలను 'నుడా'లోకి తెచ్చేటట్లుంది. అప్పుడు ఆ మండల కేంద్రాలు, గ్రామాలు కూడా 'నుడా' పరిధిలోకే వస్తాయి. నగరంలో పడే పన్నుల భారం గ్రామ ప్రజల మీద కూడా పడుతుంది. అదీగాక 'నుడా' అంటే ప్రధానంగా లేఅవుట్లు, వాటి అప్రూవల్స్ పని చూడడమే. నగర పరిధిలో డిటిసిపి అప్రూవల్ లేఅవుట్లు వేయడమే కష్టంగా వుంది. 'నుడా' పరిధిలోకి వచ్చిన మండల కేంద్రాలలో సైతం 40అడుగుల రోడ్లతో లేఅవుట్లు వేయాలి. రిజర్వ్ స్థలాన్ని ఖచ్చితంగా వదలాలి. జిల్లా మొతాన్ని 'నుడా'లో కలిపే ప్రయత్నాల పట్ల రియల్టర్లు నిరాశ చెందుతున్నారు.

రాష్ట్రంలో రాబోయే ఐదేళ్లు కూడా ఛార్జీలు, పన్నులు వంటివి బాదడం తప్పించి అభివృద్ధేమీ వుండదు. అభివృద్ధి పనులు చేయడానికి నిధులు కూడా ఏమీ లేవు. 'నుడా' ఏర్పాటు చేసినా కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు పూనుకుంటేనే నిధులన్నా వస్తాయి. ఆయన ట్రంకురోడ్డు విస్తరణకు, కేంద్రం నుండి వచ్చే నిధులకు లింకుపెట్టి ఉన్నారు. కాబట్టి 'నుడా' ప్రచారం చేసుకోవడానికి తప్పితే ప్రగతికి పనికిరాకపోవచ్చు.

## ఆ రెండూ అమలైతే...

# జిల్లాకు జలకళ





***రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు సొంత జిల్లా చిత్తూరు మీద ప్రేమో, లేక నెల్లూరుజిల్లా అంటే కోపం పోయిందో తెలియదు గాని తాజాగా చేసిన ప్రతిపాదన మాత్రం నెల్లూరు రైతాంగానికి వరం లాంటిదే! అయితే ఇది సీఎం సొంతజిల్లా చిత్తూరుకు కూడా ప్రయోజనం కలిగించేదే అనుకోండి.***

నాగార్జునసాగర్ రిజర్వాయర్ నుండి నెల్లూరుజిల్లా లోని సోమశిల రిజర్వాయర్‌కు నీటిని తరలించే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నీటి పారుదల శాఖ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. నాగార్జునసాగర్ నుండి కుడికాలువ ప్రకాశం జిల్లా గిద్దలూరు దాకా వస్తుంది. అక్కడనుండి సోమశిలకు 150 నుండి 200కిలోమీటర్లలోపు వుంటుంది. ఇక్కడ నుండి కాలువను తీస్తే అంచనా వ్యయం బాగానే తగ్గుతుంది. కాని కుడికాలువ చివరి ఆయకట్టు దాకా నీళ్లు రావడం లేదని అక్కడి రైతులే గగ్గోలు పెడుతున్నారు. కాబట్టి ఈ కాలువకు సోమశిలను అనుసంధానం చేయడం దండగే. దీనిబదులు సాగర్ నుండి సోమశిల వరకు 393 కిలోమీటర్ల పొడవున కొత్తగా కాలువ నిర్మాణానికే ఇరిగేషన్ అధికారులు మొగ్గుచూపుతున్నారు. అయితే ఇందుకు 3 నుండి 4వేల కోట్లు దాకా ఖర్చుకావచ్చు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఇప్పుడంత సీన్ ఉందా అనేది పెద్దప్రశ్న? కేంద్రం దయతలిస్తే కాని ఇది రూపుదాల్చే పని కాదు. ఈ కాలువను కట్టాలనుకోవడం వెనుక చిత్తూరుజిల్లాకు నీళ్లను తీసుకెళ్లే స్కీం కూడా వుంటుందని చెప్పొచ్చు.

జిల్లాలోని కండ్లేరు రిజర్వాయర్ నుండే చెన్నైతో పాటు చిత్తూరు జిల్లాలోని పలు ప్రాంతాలకు తాగు నీటిని తరలిస్తున్నారు. శ్రీశైలం నుండి పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా సోమశిలకు నీళ్లు వస్తున్నాయి. సోమశిల నుండి కండ్లేరుకు నీటిని తరలించి చెన్నై, చిత్తూరులకు అక్కడి నుండే తీసుకుపోతున్నారు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ సామర్థ్యం ప్రస్తుతానికి పదివేల క్యూసెక్కులే వుంది. దానిని 50వేల క్యూసెక్కుల సామర్థ్యానికి పెంచాలనేది ప్రభుత్వ ఆలోచన. ఈ విధంగా చేసినా సోమశిల, కండ్లేరులలో నీటి నిల్వలు పెరుగుతాయి. సులభంగా చిత్తూరుకు నీళ్లు తోడ్కొని పోవచ్చు.

సాగర్ నుండి సోమశిలకు కాలువ సుదీర్ఘకాల ప్రయత్నం. ఇప్పుడు మొదలుపెడితే ఎప్పటికి పూర్తవుతుందో చెప్పలేం. అయితే పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ సామర్థ్యం పెంచాలనే డిమాండ్ ఎప్పటినుండో వుంది. ప్రభుత్వం తక్షణం ఈ పనికి పూనుకుంటే జిల్లా రైతాంగం నెత్తిన నీళ్లు పోసినట్లవుతుంది.

# జాప్యం శాపమైంది

కృష్ణపట్నంపోర్టు సెజ్ వద్ద కినెట థర్మల్ పవర్‌ప్లాంట్‌కు కేటాయించిన భూములు రద్దు చేసేందుకు రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం తీసుకుంది. వైకాపా నేత, మాజీఎంపి బాలశౌరికి చెందినదే 'కినెట' సంస్థ. అంతకుముందు ఆయన కాంగ్రెస్‌పార్టీ ఎంపీగా ఉన్నారు. నెల్లూరుజిల్లాలో థర్మల్ పవర్‌ప్లాంట్ ఏర్పాటుకు 2007లో కినెట సంస్థ దరఖాస్తు చేసింది. ఈ క్రమంలో చిల్లకూరు మండలం తమ్మినపట్నం, మోమిడి గ్రామాలలో 814.77 ఎకరాల భూమిని ఏపిఐఐసి సేకరించి కినెటకు 2009లో అప్పగించింది. 1980మెగావాట్ల విద్యుత్ సామర్థ్యంతో ఇక్కడ థర్మల్ విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు అనుమతి పొందారు. పర్యావరణ అనుమతి కూడా లభించింది. అనుమతులిచ్చిన రెండేళ్లలోగా ప్రాజెక్ట్ పూర్తికావాలి. కాని ఈ సంస్థ అసలు నిర్మాణమే చేపట్టలేదు. ఏపిఐఐసి పలుమార్లు 'కినెట' సంస్థకు షోకాజ్ నోటీసులు జారీచేసినా ఫలితం లేకుండాపోయింది. 2013జూలైలో ఏపిఐఐసి చివరి షోకాజ్ నోటీసు జారీ చేయగా, మరో నాలుగేళ్లు గడువు కావాలని 'కినెట' సంస్థ కోరింది. ఈలోపే 'జిందాల్' కంపెనీతో బేరం పెట్టుకున్నారు. మేజర్ వాటాను జిందాల్‌కు అమ్మారు. దీనికి జిందాల్ పవర్‌ప్లాంట్‌గా కూడా పేరు మార్చారు. ఏపిఐఐసి భూకేటాయింపు నియంత్రణ చట్టం-2012 ప్రకారం ప్రాజెక్ట్ పూర్తయిన తర్వాత మాత్రమే వాటాలను బదలాయించాలి. కాని కినెట సంస్థ తట్ట మట్టిపని కూడా చేయకముందే జిందాల్‌కు వాటాను అమ్మింది. దీనిపై తెలుగుదేశంపార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఉద్యమించారు. స్థానికులతో కలిసి పోరాడారు. లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఈమధ్య పవర్‌ప్లాంట్ భూముల చుట్టూ కాంపౌండ్‌వాల్ కట్టేందుకు జిందాల్ కంపెనీ ప్రతినిధులు ప్రయత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. ఎట్టకేలకు రాష్ట్రంలో భూములు తీసుకుని కూడా ప్రాజెక్టులు మొదలుపెట్టని కంపెనీలపై మంత్రివర్గ ఉపసంఘం దృష్ట సారించి భూకేటాయింపులు రద్దు చేయాలని సిఫారసు చేసిన కొన్ని కంపెనీలలో 'కినెట'ను కూడా చేర్చడం గమనార్హం.

# నెల్లూరు కబుర్లు

## జపాన్ పర్యటనలో నెల్లూరోళ్లు





రాష్ట్ర రాజధాని నిర్మాణం, రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకు రావడం వంటి అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలోని బృందం బుధవారం జపాన్‌కు వెళ్లింది. ఈ బృందంలో మన జిల్లాకు చెందిన మున్సిపల్‌శాఖ మంత్రి పి.నారాయణతో పాటు దేశంలోనే విజయవంతమైన సెజ్‌గా ప్రశంసలు పొందుతున్న శ్రీసిటీ ఛైర్మెన్ రవిసన్నారెడ్డి కూడా ఉన్నారు. చంద్రబాబు కేబినెట్‌లో నెంబర్-2 పాత్ర పోషిస్తున్న నారాయణను చంద్రబాబు ఎక్కడకు వెళుతున్నా తన వెంటే ఉంచుకుంటున్నాడు. రాష్ట్రాభివృద్ధిపై ఏ కమిటీని వేసినా అందులో నారాయణ ఉండాల్సిందే! ఇక శ్రీసిటీ ఛైర్మెన్ రవిసన్నారెడ్డికి జపాన్‌కు చెందిన పారిశ్రామికవేత్తలతో మంచి సంబంధాలున్నాయి. శ్రీసిటి సెజ్‌లో ఎన్నో జపాన్ కంపెనీలు తమ పరిశ్రమలను స్థాపించాయి. పెట్టుబడులను ఆకర్షించడంలో రవిసన్నారెడ్డి అనుభవం తమకు ఉపయోగపడుతుందని భావించిన చంద్రబాబు ఆయనను తమతో తీసుకెళ్లడం విశేషం. ఈ బృందం ఈ నెల 30న తిరిగి ఇండియాకు రానుంది.

## వైభవంగా సత్యసాయిబాబా జయంతి



దుప్పట్లు పంపిణీ చేస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రామలింగాపురంలోని శ్రీ సత్యసాయిబాబా మందిరంలో సత్యసాయి 89వ జయంతి వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా దానశీలి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ మానవసేవే మాధవసేవగా భావించి మానవత్వంతో పేదలకు సహాయపడాలన్న సంకల్పంతో శ్రీసత్యసాయిబాబా మందిరం నిర్వాహకులు చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీఛైర్మెన్ దేగా నారశింహారెడ్డి, గోపాల్‌రెడ్డి, మందిరం నిర్వాహకులు సుధాకర్‌లు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది.

## ఉత్తమ రోటరీ అసిస్టెంట్ గవర్నర్‌గా రాఘవేంద్రశెట్టి



బెంగుళూరులో మంగళవారం రోటరీ డిస్ట్రిక్ట్ 3160(2013-14) సంస్థ అవార్డు ఫంక్షన్‌లో 10రోటరీ జిల్లాల్లో(కర్నాటక, ఆంధ్రప్రదేశ్) నెల్లూరు(సింహపురి జోన్) రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ఎస్.రాఘవేంద్రశెట్టికి ఉత్తమ అసిస్టెంట్ గవర్నర్ బహుమతిని రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ గోపీనాథ్ బహూకరించారు. నెల్లూరు(సింహపురి జోన్) నుండి రాఘవేంద్రశెట్టి ఆధ్వర్యంలో రోటరీ ఫౌండేషన్‌కు 10లక్షల రూపాయలు విరాళం, జిల్లాల్లో అన్ని రోటరీక్లబ్‌ల ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు గాను రాఘవేంద్రశెట్టికి ఈ బహుమతి లభించిందని జిల్లా గవర్నర్ గోపీనాథ్ తెలిపారు.

### రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలకు
## రత్నం విద్యార్థి



ఈ నెల 21 నుండి 23వ తేదీ వరకు గుంటూరులో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ వారు నిర్వహించిన స్కేటింగ్ పోటీలలో నెల్లూరు నగరం సరస్వతినగర్‌లోని డా॥ కిషోర్స్‌రత్నం ఒలింపియాడ్ బ్యాచ్‌లో తొమ్మిదవ తరగతి చదువుతున్న విద్యార్థి వై.దుష్యంత్ అండర్-17 విభాగంలో పాల్గొని రాష్ట్రస్థాయి మూడవ స్థానంలో రజత పతకం సాధించాడని స్కూలు డైరెక్టర్ డా॥ కె.కృష్ణకిషోర్ తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన కార్యక్రమంలో దుష్యంత్‌ను ప్రిన్సిపాల్ కెవిడి మనోజ్‌కుమార్ పుష్పగుచ్ఛంతో అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ వాసంతికృష్ణకిషోర్, విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, ఏఒ రియాంక, విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

### బాధ్యతలు తీసుకున్న
## డిసిఆర్‌బి డిఎస్పీ

డిసిఆర్‌బి డిఎస్పీగా నారాయణస్వామి రెడ్డి సోమవారం నెల్లూరులోని తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జిల్లా పత్తికొండ సిఐగా పనిచేస్తూ డిఎస్పీగా పదోన్నతి పొందిన ఆయనకు నెల్లూరులో పోస్టింగ్ ఇచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మర్యాదపూర్వకంగా గ్రీవెన్స్‌సెల్‌లో ఎస్పీ సెంథిల్‌కుమార్‌ను కలిసారు.

## ఇద్దరు ఎస్ఇలు బదిలీ

జిల్లా రోడ్లు భవనాల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ శేషుకుమార్ ఇక్కడ నుంచి విజయవాడకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో విజయవాడ జాతీయ రహదారి విభాగం ఎస్ఇగా పనిచేస్తున్న విజయకుమార్‌ను ఇక్కడ నియమించారు. అదేవిధంగా, జిల్లా నీటిపారుదల శాఖ ఎస్ఇ కోటేశ్వరరావు కడపజిల్లా తెలుగు గంగ ప్రాజెక్ట్ ఎస్ఇగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అనంతపురం జిల్లాకు చెందిన ఆర్.రెడ్డెయ్యను నెల్లూరుజిల్లా నీటిపారుదలశాఖ ఎస్ఇగా నియమించారు.

## తూ.కొ అధికారి ట్రాన్స్‌ఫర్

జిల్లా తూనికలు కొలతల శాఖ సహాయ నియంత్రణాధికారి ఆర్.ప్రభుకుమార్ అనంతపురం జిల్లా సహాయ నియంత్రణాధికారిగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించకపోవడంతో నెల్లూరుజిల్లాలో కూడా ఆయనే ఇన్ ఛార్జ్‌గా కొనసాగుతారు.

## వక్ఫ్‌బోర్డ్ ఇన్స్‌పెక్టర్ బదిలీ

జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్స్‌పెక్టర్‌గా పనిచేస్తున్న మైదర్ బాషా కృష్ణాజిల్లాకు బదిలీ అయ్యారు. కృష్ణాజిల్లాలో పనిచేస్తున్న అహ్మద్‌బాషాను నెల్లూరుజిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్స్‌పెక్టర్‌గా నియమించారు.

## ఆర్టీవోల బాధ్యత స్వీకరణ

నెల్లూరు, గూడూరు రవాణాశాఖాధికారులుగా ఎన్.పూర్ణచంద్రరావు, బి.చందర్‌లు సోమవారం నెల్లూరులోని జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. పాత ఆర్టీఓ రాంప్రసాద్ వీరికి బాధ్యతలు అప్పగించారు. రాంప్రసాద్ ఒంగోలు ఆర్టీఓగా బదిలీకావడం జరిగింది.

### ఐసిడిఎస్ సూపరింటెండెంట్‌గా
## హైమావతి

నెల్లూరుజిల్లా స్త్రీ శిశు అభివృద్ధి సంస్థ (ఐసిడిఎస్) కార్యాలయ సూపరింటెండెంటుగా జి.హైమావతి నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

### జిల్లా ఇన్‌చార్జి సీపీఓగా
## కేటీ వెంకయ్య

నెల్లూరు జిల్లా ఇన్‌చార్జి ప్రణాళిక సంఘం అధికారి (సీపీఓ) డిప్యూటీ డైరెక్టర్ ఎ.ఉదయభాస్కర్ తూర్పు గోదావరి జిల్లా సీపీఓ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో ఒంగోలు సీపీఓ కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్ కేటీ వెంకయ్య ఇన్‌చార్జి సీపీఓగా వ్యవహరిస్తారు.



### వైద్యఆరోగ్య శాఖాధికారిగా
## బాధ్యతలు చేపట్టిన భారతీరెడ్డి

జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారిగా బత్తల భారతీరెడ్డి ఈ నెల 25వ తేదీన నెల్లూరులోని తన కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు. హైదరాబాద్‌లో ఫీల్డ్ ఎప్డయాలజీ ట్రెయినింగ్ ప్రోగ్రామ్‌ను ముగించుకుని ఆమె నెల్లూరొచ్చి బాధ్యతలు తీసుకున్నారు. భారతీరెడ్డికి నెల్లూరుజిల్లా కొత్తకాదు. 2006 నుండి 2010 వరకు గూడూరులో డిప్యూటీ డిఎం అండ్ హెచ్‌ఓగా పనిచేశారు. 2010నుండి 2012వరకు డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్ అధికారిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2012లో అడిషనల్ డిఎం అండ్ హెచ్‌ఓగా పదోన్నతి పొంది చిత్తూరుకు బదిలీ అయ్యారు. ఇక్కడ ఇన్‌ఛార్జ్ డిఎం అండ్ హెచ్‌ఓగా వున్న డాక్టర్ కోటేశ్వరి చిత్తూరు డిఎం అండ్ హెచ్‌ఓగా బదిలీ కావడం జరిగింది.

## టెలిఫోన్ అదాలత్

- ఫిర్యాదులు 15రోజుల్లో పరిష్కారం
- టెలికం డిప్యూటీ జనరల్ మేనేజర్

నెల్లూరు నగరంలోని బిఎస్ఎన్ఎల్ జిల్లా కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం టెలిఫోన్ అదాలత్ జరిగింది. ఈ కార్యక్రమంలో సంస్థ డిప్యూటీ జనరల్‌మేనేజర్(హెచ్ఆర్) జయకుమార్, సిపివో తంగమణి, ఏవో నాగరాజులు పాల్గొని వినియోగదారుల సమస్యలు తెలుసుకుని అర్జీలు స్వీకరించారు. సమస్యలను 15రోజుల్లో పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు.

## మారిన నియోజకవర్గాల నెంబర్లు

శాసనసభ ఎన్నికల సమయంలో ఒక్కో నియోజకవర్గానికి ఒక్కో నెంబర్ వుంటుంది. విభజనకు ముందు రాష్ట్రంలో 294అసెంబ్లీలు ఉండేవి. కాబట్టి 1 నుండి 294నెంబర్లుండేవి. ఈ క్రమంలో మన జిల్లాలో అసెంబ్లీలకు 233 నుండి 242వరకు నెంబర్లుండేవి. విభజన తర్వాత రాష్ట్రంలో 175అసెంబ్లీలే మిగిలాయి. దీంతో నెంబర్లు మారాయి. జిల్లాలో పది అసెంబ్లీలకు 114నుండి 123వరకు నెంబర్లు కేటాయించారు. కావలికి 114, ఆత్మకూరుకు 115, కోవూరుకు 116, నెల్లూరు నగరంకు 117, నెల్లూరు గ్రామీణంకు 118, సర్వేపల్లికి 119, గూడూరుకు 120, సూళ్లూరుపేటకు 121, వెంకటగిరికి 122, ఉదయగిరికి 123నెంబర్లు కేటాయించారు.

## తుఫాన్ బాధితులకు ఎస్ఆర్‌కె విద్యార్థుల చేయూత



హుద్‌హుద్ బాధితులను ఆదుకోవాలనే సంకల్పంతో నెల్లూరు మాగుంట లేఅవుట్‌లో వున్న డాక్టర్ ఎస్ఆర్‌కె స్కూలు విద్యార్థులు రూ.41వేలను సోమవారం నెల్లూరుజిల్లా ప్రైవేట్‌స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.మనోహర్‌రెడ్డికి అందజేశారు. పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో డైరెక్టర్ దిలీప్‌కుమార్ ఈ మొత్తాన్ని విశాఖపట్టణం బాధితులకు వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధినేత పి.కృష్ణమూర్తి, నగర ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శౌరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన రెయిన్‌బో గేమ్స్ గాలా



నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో రెండురోజులపాటు జరిగిన రెయిన్‌బో స్కూల్ గేమ్స్‌గాలా ఆదివారంతో ముగిసింది. వివిధ క్రీడల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నెల్లూరుజిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎతిరాజ్ మాట్లాడుతూ మానసికోల్లాసం, శారీరక దృఢత్వాన్ని కలిగించే క్రీడల్లో విద్యార్థులను భాగస్వామ్యం చేయడం అభినందనీయ మన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ పద్మా సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్ అమరా స్వయంప్రభ, ప్రీప్రైమరీ ఇన్‌ఛార్జి ఫాతిమాఖాన్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సిఐ స్థాయికి డిఎస్పీలు

పోలీసుశాఖలో సంస్కరణలు అధికారుల హోదాను పెంచుతూ పరిధిని తగ్గిస్తున్నాయి. ప్రతి నియోజకవర్గానికో డిఎస్పీని ఏర్పాటు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనపై పోలీసు వర్గాలలో మిశ్రమస్పందన కనిపిస్తుంది. ఇలా జరిగితే డిఎస్పీ స్థాయి సిఐ స్థాయికి పడిపోతుందని కొందరు అధికారులు నిరాశ చెందుతుండగా, పోలీసుశాఖపై పర్యవేక్షణ పెరుగుతుందనే అభిప్రాయం కూడా పోలీసుశాఖలో వుంది. మన జిల్లాలోనే చూస్తే నెల్లూరు నగరం, రూరల్, గూడూరు, కావలి, ఆత్మకూరు సబ్‌డివిజన్‌లకు మొదటి నుండి డిఎస్పీలు ఉన్నారు. వీరు కాకుండా ఈమధ్య క్రైం, ట్రాఫిక్, మహిళాస్టేషన్, డిసిఆర్‌బి, ఎస్బీ, ఎస్టీ సెల్ విభాగాలకు ఆరుమంది డిఎస్పీలను వేశారు. ఎస్ఐలు నగరంలో పనిచేయడానికి కంటే కూడా మండల కేంద్రాలలో పనిచేయడానికే ఇష్టపడుతు న్నారు. సిఐల పరిస్థితి కూడా అలాగే వుంది. ఇటీవలకాలం వరకు నెల్లూరు నగరంకు ఒక్క సిఐ ఉండేవాడు. ఐదు పీఎస్‌లు అతని పరిధిలో ఉండేవి. కాని ఇప్పుడు ఒక్కో పిఎస్‌కు ఒక్కో సిఐను నియమించడంతో నగరంలో సిఐ పోస్టింగ్ అడిగేవాళ్లు లేకుండాపోయారు. రేపు నియోజక వర్గానికో డిఎస్పీ అంటే వాళ్ల పరిస్థితి కూడా ఇలాగే వుంటుంది.

# క్యాన్సర్ ఆసుపత్రిలో నూతన ఓపి భవనం

• వ్యాధిగ్రస్తుల సేవకు సిద్ధం



నెల్లూరుజిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాలకు చెందిన క్యాన్సర్ రోగులకు సేవలందిస్తున్న నెల్లూరులోని రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రిలోని భగవాన్ మహావీర్‌జైన్ ఛారిటబుల్‌ట్రస్ట్ శస్త్రచికిత్స భవనంలోని అవుట్‌పేషంట్ విభాగాన్ని ఈ నెల 24వ తేదీన ఆ ట్రస్టు అధ్యక్షులు ఎస్.మోహన్‌లాల్‌జైన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా 10లక్షల రూపాయల విరాళం చెక్కును ట్రస్టు సభ్యులు ఆసుపత్రి కన్వీనర్ టి.శివప్రసాద్‌రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ మెడిసిటి డైరెక్టర్ డాక్టర్ కృష్ణ, జైన్ చారిటబుల్‌ట్రస్ట్ సభ్యులు జె.పి.జైన్, వినోద్‌జైన్, పరస్‌మల్‌జైన్, పి.వి.చౌహాన్, క్యాన్సర్ ఆసుపత్రి ఇన్‌ఛార్జ్ డైరెక్టర్ డాక్టర్ టి.లక్ష్మి, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ జె.వి.రామ్మోహన్ రావు, డాక్టర్ గీతా ఉషశ్రీ, రెడ్‌క్రాస్ గౌరవ కన్వీనర్ డాక్టర్ ఏ.వి.సుబ్రహ్మణ్యం, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## ఈ ఘనతంతా డా॥ ఏ.వి.యస్‌దే...

రెడ్‌క్రాస్ కార్యదర్శిగా క్యాన్సర్ ఆసుపత్రికి పునాది వేసినప్పటినుండి ఎంతోమంది దాతల ఇళ్లకు జోలెపట్టి తిరిగి, కీర్తిశేషులు మాగుంట సుబ్బరామరెడ్డి నుండి మహావీర్ జైన్ చారిటబుల్‌ట్రస్ట్ వరకు అందరిలో స్ఫూర్తిని నింపి ఈ ఆసుపత్రి అభివృద్ధికి మూలస్థంభంగా నిలిచిన వ్యక్తి డా॥ ఏ.వి.యస్. ఈ ఆసుపత్రికి ఆయన సేవలు ఎప్పటికీ మరువరానివే. అయితే క్యాన్సర్ ఆసుపత్రి అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ఆసుపత్రి వర్గాలు విడుదల చేస్తున్న పత్రికాప్రకటనల్లో ఏ.వి.యస్ పేరు చోటు చేసుకోకపోతుండడం బాధాకరం. అనర్హులైన వారి పేర్లు అనేకం ఆ ప్రకటనల్లో పొందుపరుస్తూ ఆదినుండి ఈ ఆసుపత్రి కోసం శ్రమించిన డా॥ ఏ.వి.యస్.ను మరచిపోవడం శోచనీయం.

## తెలుగు జాతికి దొరికిన

# సుస్వరాల పాటల హారం.. సుద్దాల సాహితీ సుమహారం

### సుమధుర వేడుకగా డా॥ నాగభైరవ అవార్డు పండుగ



ఇది వ్యక్తిగతంగా నాకు జరిగిన సన్మానంగా నేను భావించడం లేదని, ఇది పాటకు ఘనసన్మానమని, తన పాటలకు అందుతున్న పురస్కారంగా భావిస్తూ... ఎంతో ప్రతిష్ఠాత్మకమైన డా॥ నాగభైరవ కోటేశ్వరరావు స్మారక అవార్డును అందుకుంటున్నానని ప్రముఖ సినీ కవి సుద్దాల అశోక్‌తేజ పేర్కొన్నారు.

నెల్లూరు టౌన్‌హాలులో 23వ తేదీ సాయంత్రం డా॥ నాగభైరవ అవార్డు కమిటి ఏర్పాటుచేసిన 6వ అవార్డు పండుగలో ఆయన మాట్లాడుతూ ఎందరో మహనుభావులు జిల్లా నుంచి కళామతల్లికి సేవ చేస్తున్నారని, వారు నడిచిన ఈ గడ్డ పాదధూళిని తాను నుదిటి కుంకుమలా పెట్టుకుంటానన్నారు. ఏ జాతికో, రాష్ట్రానికో తాను పరిమితం కాదని, తెలుగు పాటకు చెందిన వాడనని అన్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలి, గొప్ప రచయిత నాగభైరవ పురస్కారం తనకు దక్కడం నాగభైరవనే తన చేతిలో పెట్టి ఇంటికి తీసుకుపొమ్మన్నంత ఆనందంగా ఉందని అశోక్‌తేజ అన్నారు. నెల్లూరుకు చెందిన టి.వి.రమణారెడ్డి, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, వాణిశ్రీ వంటి ప్రముఖులు నడిచిన సింహపురి పుడమితల్లి మట్టిని నుదుటి కుంకుమగా దిద్దుకునే అవకాశం ఈ అవార్డు కల్పించిందన్నారు. అంతకుముందు ప్రతిష్ఠాత్మకమైన డా॥ నాగభైరవ పురస్కారాన్ని అతిథులందరూ కలిసి అశోక్‌తేజకు అందజేసి శాలువ, గజమాల, కిరీటం, జ్ఞాపికలతో సత్కరించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాలను విడగొట్టినా తెలుగు భాషను మాత్రం ఎవరూ విడగొట్టలేరన్నారు. సుద్దాల అశోక్‌తేజ వ్రాసిన ఠాగూరు సినిమాలోని 'నేను సైతం' పాట జనజీవితాన్ని ప్రభావితం చేసిందన్నారు. గతంలో "నేను సైతం" పాట వింటే మహాకవి శ్రీశ్రీ గుర్తుకొచ్చేవాడని, ఠాగూర్ చిత్రం వచ్చినప్పటి నుండి ఆ పాట వింటే సుద్దాల అశోక్‌తేజ అందరికీ గుర్తొస్తున్నాడన్నారు.

'లాయర్' వారపత్రిక సంగ్రాహకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగు భాషకు ఎల్లలు లేవని, ప్రాంతాలు భేదాలు వుండవని, భావం ఒక్కటే వుంటుందని అన్నారు. సుద్దాలకు ఈ అవార్డు ఇవ్వడం నెల్లూరుకే గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా గతంలో ఓ కార్యక్రమంలో సుద్దాల అశోక్‌తేజ వెలిబుచ్చిన తన అంతరంగంలోని భావోద్వేగాలను ఐప్యాడ్ ద్వారా ప్రేక్షకులకు వినిపించి అందరినీ ఆశ్చర్యచకితులు గావించారు. నల్గొండ జిల్లాలోని సుద్దాల గ్రామంలో జన్మించిన సుద్దాల అశోక్‌తేజ తన తండ్రి హనుమంతరావు స్ఫూర్తితో తన పూరిపేరునే ఇంటిపేరుగా మార్చుకుని సాహితీ రంగంలో తన విజయప్రస్థానాన్ని కొనసాగించడం అభినందనీయమని అన్నారు. అశోక్‌తేజ తెలంగాణకు చెందినవాడు కాదని తెలుగు గానానికి చెందినవాడని ప్రభు కీర్తించాడు.

సభాధ్యక్షులుగా వ్యవహరించిన డా॥ నాగభైరవ అవార్డు కమిటీ అధ్యక్షులు ప్రముఖ సినీ గేయరచయిత వెన్నెలకంటి మాట్లాడుతూ ఈ అవార్డు పండుగను గత ఆరేళ్లుగా జరుపుకుంటున్నామన్నారు. మహావ్యక్తి నాగభైరవను వరించని అవార్డు లేదన్నారు. శ్రీశ్రీ, వేటూరి తర్వాత మూడవ జాతీయ స్థాయి అవార్డును సాధించిన వ్యక్తి సుద్దాల అశోక్‌తేజ అని కొనియాడారు. సందర్భోచితంగా పాటలు రాయడం, నిజ జీవితంలో జరిగే సంఘటనల ఆధారంగా తన భావాలను వ్యక్తీకరించడం సుద్దాల అశోక్ ప్రత్యేకత లని కొనియాడారు. సినీరంగంలో సుద్దాల అశోక్ వంటి మిత్రుడిని పొందడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఆయన తనకి తమ్ముడి లాంటి వాడని, ఈరోజు నాగభైరవ అవార్డు ఆయనకి రావడం తన కుటుంబసభ్యుడికి వచ్చినంత ఆనందంగా భావిస్తున్నానని అన్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయుడు బొగ్గరపు రాధాకృష్ణమూర్తి అశోక్‌తేజ సత్కార పత్రాన్ని తన గంభీర స్వరంతో చదివి వినిపించారు. అనంతరం దేవరాల సుబ్రహ్మణ్యంయాదవ్, చంద్రలత, రాచపాళెం రఘు, ఎంవిఎస్ ప్రసాద్ తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా నాగభైరవ స్ఫూర్తి అవార్డులను ఏటూరి నాగేంద్రరావు, కోసూరు రవికుమార్, కోకా విమల కుమారి, తూమాటి సంజీవరావు, అద్దేపల్లి జ్యోతి, శ్రీరామకవచం సాగర్‌లకు అందజేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుగ్రహీత సాహితీవేత్త, ఆదాయపు పన్ను శాఖ జాయింట్ కమిషనర్ సలీంను ప్రత్యేక పురస్కారంతో సత్కరించారు.

కార్యక్రమానికి ముందు కళాంజలి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో చిన్నారులు మణికంఠసాయి, శివకుమార్, హంసిని, రాజలక్ష్మి, జ్ఞానశ్రీ, శ్వేతలు ఆలపించిన అలనాటి సుమధుర పాటలు అందరినీ మైమరపించాయి. శాంతి, గిరి, అనూప్, విజయ్, సంగీత్‌లు వాయిద్య సహకారమందించారు. కార్యక్రమాన్ని అవార్డు కమిటి ప్రధానకార్యదర్శి చిన్ని నారాయణరావు, కళాంజలి అనంత్, శర్మ పర్యవేక్షించారు. దువ్వూరు బెనర్జి, అరుణ్‌లు వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. సరిగా 6గంటల 15నిముషాలకు జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమం మొదలై 9.30 గంటలకు ముగిసింది.





నాగభైరవ స్ఫూర్తిఅవార్డుల ప్రదానం



కేంద్ర సాహితీ అవార్డు గ్రహీత సలీంను సత్కరిస్తున్న అతిథులు

# గూడూరు డివిజన్ వార్తలు

## నియోజకవర్గంలో భూసమస్యలు అధికం

**- ఎమ్మెల్యే పాశం సునీల్**



ఆర్డీవోతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు నియోజకవర్గంలో భూసమస్యలే అధికంగా ఉన్నాయని, వాటిపై దృష్టి సారించకపోవడంతో జఠిలమవుతున్నాయని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజావిజ్ఞప్తుల దినం సందర్భంగా ఆర్డీవో రవీందర్‌ను కలసి చర్చించారు. నిత్యం కార్యాలయాల చుట్టూ బాధితులు కాళ్లరిగేలా తిరుగుతున్నా పరిష్కారం కావడం లేదన్నారు. అధికారులపై ఎన్నో ఆశలు పెట్టుకొని తమ పని నెరవేరుతుందని పనులు మానుకొని ప్రదక్షిణలు చేస్తున్నా పేదలకు న్యాయం జరగడంలేదన్నారు. కాగా మహిళా మండలి ఆధ్వర్యాన తరచూ కార్యక్రమాలు చేపడుతున్నామని ఆ స్థలాన్ని సొంతం చేసుకునేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఆ మండలి సభ్యులు ఆర్డీవోకి వివరించారు. ప్రాంతీయ వైద్యశాల మార్చురీ గది ఆనుకుని మహిళా మండలి భవనం ఉండడంతో కొంత ఇబ్బందులు ఉన్నాయని, మహిళలు ఇక్కడకు వచ్చేందుకు భయాందోళన చెందుతున్నారన్నారు.

## ప్రసన్న వెంకటేశ్వరస్వామి కళ్యాణోత్సవం



కళ్యాణోత్సవ పూజలు చేస్తున్న ఆలయ మాజీ ఛైర్మెన్ రామమోహన్‌రావు దంపతులు

గూడూరు పట్టణంలోని రాజావీధిలో వెలసివున్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాస పూజలు 22వతేదీ ఘనంగా జరిగాయి. కార్తీకమాసం ముగింపు సందర్భంగా విష్ణుసహస్రనామ భక్త బృందం ఆధ్వర్యాన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవారి కళ్యాణోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో గోపూజలు చేశారు. మహిళలు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామివారి కళ్యాణాన్ని తిలకించారు. ఆలయ ప్రాంగణంలో వనభోజనాలు చేశారు. దేవదేవేరులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అలాగే ఆలయంలో ధ్వజస్థంభం వద్ద కార్తీకదీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీఛైర్మెన్ శ్రీకంఠి రామమోహన్‌రావు, వారి సతీమణి రాజ్యలక్ష్మి, సాయి సత్సంగ నిర్వాహకులు కోట ప్రకాష్‌రావు దంపతులు, మాజీసభ్యులు ఎస్.నాగరాజారావు, వల్లంకొండ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొని పూజలు చేశారు.

## వినతుల వెల్లువ



మాట్లాడుతున్న తహశీల్దార్ వెంకటనారాయణమ్మ

గూడూరు మండలంలో భూ సమస్యలపైనే అధికంగా వినతులు అందాయని తహశీల్దార్ వెంకటనారాయణమ్మ తెలిపారు. కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావిజ్ఞప్తుల దినం సందర్భంగా మండలంలోని ఈదలపల్లి, పగడాలపల్లి, దీవిపాళెం, చెన్నూరు, పోటుపాళెం, పాలిచర్ల తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలు భూసమస్యలను పరిష్కరించాలని అర్జీలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చిన అర్జీలపై ఆయా గ్రామాల వీఆర్వోలతో చర్చించి తక్షణం పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని సూచించారు. ఈ కార్యక్రమంలో పలుశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కార్మికశాఖ సహాయకమిషనర్‌గా ఓంకార్‌రావు



గూడూరు కార్మిక శాఖ సహాయ కమిషనర్‌గా కె.ఓంకార్‌రావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈమేరకు ఆయన సోమవారం రెండో పట్టణంలోని నరసింహరావుపేటలోని కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాల అమలుకు కృషి చేస్తామన్నారు. గూడూరు సహాయకమిషనర్ పరిధిలో గూడూరు, నాయుడుపేట, ఆత్మకూరు, ఉదయగిరి, రాపూరు, సహాయకార్మికశాఖ అధికారుల కార్యాలయాలు పనిచేస్తాయని వివరించారు. బాలకార్మికులను గుర్తించి వారికి విముక్తి కల్పించడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వివరించారు.

# శ్రీకాళహస్తి న్యూస్

## భక్తుల సేవే... శివయ్య సేవ

**- ఇ.ఓ. రామిరెడ్డి**



దక్షిణకాశిగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తీశ్వరాలయం ఇన్‌ఛార్జి ఇ.ఓ.లతో కొంతకాలం గడిచింది. దీంతో దేవాదాయ శాఖ ఉత్తర్వులతో శ్రీకాళహస్తీశ్వరాలయ కార్యనిర్వాహాధికారిగా బి.రామిరెడ్డిని నియమించారు. ఇటీవల మొదట స్వామి, అమ్మవార్ల దర్శనానంతరం ఇ.ఓ.గా బి.రామిరెడ్డి దక్షిణామూర్తి ఎదుట సంత కాలు పెట్టి బాధ్యతలు స్వీకరించారు. తిరుమల వెంకన్న ఆశీస్సులతో శ్రీకాళహస్తి శివయ్య సేవా భాగ్యం లభించిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఇ.ఓ.గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ భక్తులకు సేవ చేస్తే శివయ్యకు సేవ చేసినట్లుగా భావిస్తూ బాధ్యతగా పనిచేస్తానన్నారు. రెవెన్యూశాఖలో ఆరు సంవత్సరాలు తిరుపతి ఆర్.డి.ఓ.గా పనిచేశారు. తిరుపతి నుంచి బదిలీపై ఆ తర్వాత నెల్లూరులో ఆర్.డి.ఓ.గా పనిచేశారు. మరలా తిరుమల తిరుమల తిరుపతి దేవస్థానంలో పని చేశానన్నారు. వెంకన్న ఆశీస్సులతోనే శ్రీకాళహస్తీశ్వరాలయ స్వామి అమ్మవార్ల సేవకోసం శ్రీకాళహస్తికి బదిలీపై వచ్చానన్నారు. అయితే దేవాదాయశాఖకు రెవెన్యూ శాఖకు ఎంతో తేడా ఉందన్నారు. అవినీతి , దళారీల వ్యవస్థను నిర్మూలిస్తామన్నారు. దేవస్థానంలో భక్తులకోసం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అదేవిధంగా మాజీ ఇ.ఓ. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఐదు నెలలు ఆలనాపాలనా ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. రామిరెడ్డికి బాధ్యతలు అప్పగించిన తర్వాత శ్రీకాళహస్తి ఇ.ఓ.గా పనిచేయడం ద్వారా పూర్తిగా న్యాయం చేయలేకపోయానని అసంతృప్తి వ్యక్తం చేశారు. అయినప్పటికి రూ. 101 కోట్లతోపాటు అదనంగా రూ.17కోట్లు బ్యాంక్‌లో డిపాజిట్ చేశానన్నారు. విఐపీ బ్రేక్ దర్శనాల ద్వారా రూ.20 లక్షలు ఆదాయం వచ్చేలా చేశారన్నారు.

## నేతి దీపాలకు స్థలం కేటాయించండి



శ్రీకాళహస్తీశ్వరాలయానికి భక్తులు ఎంతో భక్తిభావంతో వస్తారు కాబట్టి వారికి దీపాలు పెట్టుకోవడానికి ఓ ప్రత్యేకమైన స్థలాన్ని కేటాయించాలని బి.జె.పి. నాయకులు కొత్తగా వచ్చిన ఇ.ఓ. రామిరెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. కొత్తగా వచ్చిన ఇ.ఓ.ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎంతో మంది భక్తులు దేశ విదేశాల నుంచి స్థానికంగా ఉన్న భక్తులు దీపాలు పెట్టుకోవడానికి స్థలం లేదని ఎక్కడంటే అక్కడ దీపాలు పెట్టడం వల్ల సెక్యూరిటీ వారు బెదిరిస్తున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వచ్చిన ప్రతి భక్తుడు దీపాలు వెలిగించకుండా వెళ్లరన్నారు. శ్రీకాళహస్తి దేవస్థానంలో నేతి దీపాలు వెలిగిస్తే మోక్షం లభిస్తుందనే దృఢ నమ్మకంలో భక్తుల్లో ఉందన్నారు. అది ఇప్పుడు గుడి బయట వీధుల్లో వెలిగించాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఇ.ఓ.రామిరెడ్డి మాట్లాడుతూ భక్తుల మనోభావాలకు అనుగుణంగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. భక్తులు దీపాలు వెలిగించడానికి స్థలాన్ని కేటాయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు గరికపాటి రమేష్‌బాబు, కిట్టు, శ్రీరాములు, సుకుమార్, వెంకటేష్, కిషోర్, వాసు తదితరులు పాల్గొన్నారు.

## బీమా ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న ఎల్ఐసి ఉద్యోగులు

కేంద్రప్రభుత్వం బీమా రంగం పట్ల అనుసరిస్తున్న వైఖరిపై పట్టణంలోని ఎల్ఐసి కార్యాలయం వద్ద సోమవారం ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ అధ్యక్షులు ఆది నారాయణ, ప్రధాన కార్యదర్శి నగళ్ల శివకుమార్ మాట్లాడుతూ పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో బీమా రంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల శాతం 49 శాతానికి పెంచేందుకు చట్ట సవరణ బిల్లు ఆమోదింపజేసేందుకు కేంద్రప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. దీనివల్ల జాతి ప్రయోజనాలను దెబ్బతీస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చట్ట సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి ఉద్యోగులు దూబగుంట బాలశ్రీనివాసరావు, రాధిక, విద్యులత, మణి, నరసయ్య, పెంచలయ్య, బాషాలు పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణకు ప్రత్యేకచర్యలు

**- ఆర్టీవో చందర్**

రవాణాశాఖలో ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆర్టీవో టి.చందర్ తెలిపారు. గూడూరు ప్రాంతీయ రవాణాశాఖాధికారిగా సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఆయన గుంటూరు నుంచి బదిలీపై గూడూరుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవాణాశాఖ కార్యాలయం ప్రతిష్ట పెంచేందుకు సామాన్య ప్రజలకు సైతం విస్తృతంగా సేవలను అందిస్తామని చెప్పారు. పాఠశాలలు, కళాశాలలకు సంబంధించిన బస్సులు, వ్యాన్లు, ఆటోలను తనిఖీలు చేసి ఫిట్‌నెస్ ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఓవర్‌లోడ్‌తో వెళ్లే ఆటోలకు కళ్లెం వేస్తామన్నారు. కార్యాలయంలో మెరుగైన సేవలందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో రవాణాశాఖ అధికారులు కరుణాకర్, జాకీర్, రంగారావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

బంధువులతో ఇబ్బందులు పేచీలు రాకుండా జాగ్రత్తగా పడండి. పరిచయాలు, వ్యాపకాలు పెరుగుతాయి. ఆరోగ్య విషయంలో శ్రద్ధ చూపాలి. ఆర్థికపరమైన నిర్ణయాలలో కుటుంబసభ్యుల సహకారం తీసికొనండి. వ్యాపార వృత్తి నిర్వహణలో కొద్దిపాటి ఇబ్బందులుంటాయి. ఆదాయం సామాన్యంగా ఉంటుంది. చేపట్టిన పనులు గబగగబా జరుపుకొనవలసి వస్తుంది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

కోర్టు వ్యవహారాలలో అనుకూలత, శుభకార్యాల నిర్ణయం చర్చలు జరుగుతాయి. కొత్త వస్తువులను ఇంటికి సమకూర్చుకొంటారు. వ్యాపార సమస్యలు, ఆర్థిక సమస్యలు తొలగి అభివృద్ధి బాగుండి ఆదాయము పెరుగుతుంది. అధికారుల వల్ల వ్యాపారులకు ఒత్తిడి ఇబ్బందులుంటాయి. ఉద్యోగార్థులకు అవకాశాలు రాగలవు. దైవ కార్యాలలో బాగా సహకరిస్తారు.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

సంస్థల యజమానులకు వర్కర్లతో సమస్యలు వస్తాయి. షేర్ మార్కెట్ నిరుత్సాహపరుస్తుంది. గృహ రిపేర్లు వస్తు వాహన రిపేర్లుంటాయి. వృత్తి వ్యాపారాలలో చిన్న సమస్యలుండినా సరిజేసికొంటూ ముందుకు సాగుతారు. ఆర్థికముగా బాగుండి ఆదాయం పెరుగుతుంది. ప్రభుత్వ అనుమతులందు ఆలస్యముంటుంది. రావలసి బాకీలు సున్నితంగా వసూలు చేయండి.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

వృత్తి ఉపాధి రంగాలవారికి సామాన్య ఆదాయముంటుంది. బంధువుల రాకపోకలుంటాయి. మిత్రులు బంధువులు సహకారం బాగుంటుంది. తలపెట్టిన పనులకు ఆటంకాలు వచ్చి చికాకు పడుతుంటారు. అదనపు ఖర్చులు పెరిగిపోతాయి. వ్యాపారవర్గాలకు మంచి అవకాశాలు దొరికి ఆదాయం పెరుగుతుంది. ఉద్యోగులకు పనిభారం పెరుగుతుంది.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి – మీ వాసి

**తేది. 28.11.2014 నుండి**
**తేది. 04.12.2014 వరకు**

ఈ వారం మీనంలో కేతువు, కర్కాటకంలో గురువు, కన్యలో రాహువు, వృశ్చికంలో రవిబుధశుక్రశనులు, మకరంలో కుజుడు, మకర కుంభ మీన మేష రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

**పంచాంగము:**

తేది 30 ఆదివారము శుక్రమౌఢ్యమి సమాప్తము.

**ముహూర్తము:**

తేది 3 బుధవారం ఉదయం గంట 8.0 నుండి గంట 9.36లోగా ధనుర్లగ్నమున వ్యాపార ఉపనయనాలు.

**మార్గశీర్ష మాస శుక్లపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 28 | శుక్ర | షష్ఠి | ఉ॥గం.8.43ని॥ |
| తేది. 29 | శని | సప్తమి | ఉ॥గం.6.24ని॥ |
| | పిదప | అష్టమి | రా॥గం.4.00ని॥ |
| తేది. 30 | ఆది | నవమి | రా॥గం.1.38ని॥ |
| తేది. 01 | సోమ | దశమి | రా॥గం.11.04ని॥ |
| తేది. 02 | మంగళ | ఏకాదశి | రా॥గం.9.28ని॥ |
| తేది. 03 | బుధ | ద్వాదశి | రా॥గం.7.48ని॥ |
| తేది. 04 | గురు | త్రయోదశి | రా॥గం.6.27ని॥ |

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

నిర్మాణాలు, కొత్త కాంట్రాక్టులు, లీజులకు అనుకూలముగా ఉంటుంది. రావలసిన బాకీలు కొంత వరకు లభిస్తాయి. ఆర్థికపరమైన వ్యవహారాలలో సలహాలు పొందుతారు. వృత్తివ్యాపార వర్గాల వారికి ఆదాయం సంతృప్తికరం. అయితే ఖర్చులు కూడా అదనంగానే ఉంటాయి. ప్రభుత్వం నుండి కోరుకున్న విధంగా అనుమతులు లభించగలవు.

## మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

స్థిరాస్తులపై ఆదాయము, షేర్లపై లాభాలుంటాయి. చేపట్టిన పనులు విజయవంతం కాగలవు. ఆదాయము, ఖర్చు ఫరవాలేదనిపించగలవు. ఉద్యోగులకు పనివత్తిడి పర్యటనలు తప్పనిసరి. వ్యాపార విస్తరణ అభివృద్ధి అవకాశాలు బాగుంటాయి. బాకీలు కొంతమేరకు అందుతాయి. కోర్టు కేసుల్లో ఊరట లభిస్తుంది. ప్రయాణాలు లాభసాటి కాగలవు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

తలపెట్టిన పనులు సులువుగా జరుగుతాయి. ఉద్యోగార్థులకు శుభవార్తలు వినే అవకాశం ఉన్నది. కాంట్రాక్టర్లకు, బిల్డర్లకు ఇబ్బందులుంటాయి. భూములు స్థలాలు యొక్క క్రయవిక్రయ వ్యవహారాలు జరుగక నిలబడవచ్చును. వృత్తివ్యాపారాలలో అభివృద్ధి బాగుండి ఆదాయం బాగుంటుంది. అనుకోని ఖర్చులు పైన బడగలవు. పెట్టుబడులు, షేర్లు లాభాలనిస్తాయి.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

సోదరుల కుటుంబానికి మేలు జరుగుతుంది. చిన్న చిన్న గాయాలు తగలవచ్చు. వ్యాపార వర్గాలకు మంచి అవకాశాలుంటాయి. అనుకోని అదనపు ఖర్చులుండినా సర్దుబాటు అగును. మానసికంగా కుదుటపడతారు. అనుకున్న పనులను అనుకూలంగా నెరవేర్చుకొంటారు. ఆర్థికపరమైన ఇబ్బందులను అధిగమిస్తారు. ఉద్యోగులకు పనిభారం పెరుగుతుంది.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఉద్యోగులు విధి నిర్వహణలో జాగ్రత్త వహించాలి. బంధువులతో విభేదాలు వచ్చే అవకాశముంది. ఆర్థిక వ్యవహారాలలో ఆచితూచి వ్యవహరించండి. కొత్త పెట్టుబడులు, భాగస్వామ్యాల విషయాలలో తొందరపాటు వద్దు. వృత్తి వ్యాపారాలలో స్వల్ప అభివృద్ధి, ఒక మోస్తరు ఆదాయముంటుంది. కుటుంబంలో కొద్దిపాటి భేదాభిప్రాయాలు తలెత్తగలవు. కోర్టుకేసులు వాయిదా పడవచ్చును.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వృత్తి ఉపాధి పథకాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. ఋణాలు లభిస్తాయి. కోర్టు వ్యవహారాలలో కొంత అనుకూలత ఉంది. ఆర్థిక వ్యవహారాలు, వ్యాపారాలను జాగ్రత్తగా నడుపుతారు. ఆదాయం పెరుగుతుంది. అనుకోని కొన్ని అదనపు ఖర్చులు పైనబడతాయి. పిల్లలు విద్య, వివాహ విషయాలపై దృష్టి పెడతారు. ఉద్యోగార్థులకు ఇంటర్వ్యూ అవకాశాలుంటాయి.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

వ్యాపారులు, ఉద్యోగులపై అధికారుల వత్తిడి పెరుగుతుంది. ఆదాయం తృప్తికరంగా ఉంటుంది. వ్యవహారాలలో సరైన నిర్ణయాలు తీసికొనలేక సతమతమౌతారు. ఓర్పుతో పనులను, సమస్యలను పరిష్కరించుకొనడం వల్ల మేలు జరుగుతుంది. అనుకోని ఖర్చులు, ప్రభుత్వ అనుమతులందు ఆలస్యం జరుగుతుంది. పెద్ద పెట్టుబడులు, సంస్థల విస్తరణ ప్రయత్నాలను నిలపండి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

బంధుమిత్రుల సూటిపోటి మాటలు బాధపెడతాయి. ఉద్యోగవర్గాలకు బాధ్యతలు ఎక్కువగా ఉంటాయి. ప్రతి విషయంలోను టెన్షన్ పడుతుంటారు. కుటుంబ ఆర్థిక సమస్యలు క్రమంగా సర్దుబాటు కాగలవు. అందరితోను కలుపుకొనిపోయే విధంగా ప్రవర్తించండి. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు అవసరం. ఆత్మీయులు సహాయం చేస్తారు. దూరప్రయాణాలుంటాయి.

# మూర్ఛ వ్యాధిపై ఆందోళన వద్దు

**– జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్**




మూర్ఛ వ్యాధి (ఎపిలెప్సి)పై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఆ వ్యాధి నివారణకు ప్రస్తుతం ఎన్నో ఆధునిక వైద్య విధానాలు అందుబాటులోకి వచ్చాయని జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ అన్నారు. మూర్ఛవ్యాధి అవగాహనపై నెల్లూరులోని సింహపురి సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి వారు ఈ నెల 23న అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్ వద్ద ఎపిలెప్సి 2 కే రన్‌ను నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మూర్ఛవ్యాధి పట్ల అవగాహన పెంచుకుని, తగు చికిత్సలు చేయించుకోవడం వల్ల ఎంతో ప్రయోజనం వుంటుందని, ఈ వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చని అన్నారు. సిహపురి ఆసుపత్రి న్యూరాలజిస్ట్ డాక్టర్ బిందుమీనన్ మాట్లాడుతూ జాతీయ ఎపిలెప్సి దినోత్సవం సందర్భంగా మూర్ఛవ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కల్గించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సింహపురి ఆసుపత్రి ఛీఫ్ కో–ఆర్డినేటర్ డాక్టర్ భక్తవత్సలరెడ్డి, సిఇఓ నాగేంద్ర ప్రసాద్, నర్శింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఎపిలెప్సి 2కె రన్‌లో విజేతలైన ప్రథమ, ద్వితీయ రన్నర్స్‌కు ఈ సందర్భంగా బహుమతులు అందజేశారు.

## వైయస్సార్సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కమిటి

వైయస్సార్సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కమిటిలో నెల్లూరుజిల్లా నుంచి నలుగురికి చోటు కల్పిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ప్రకటించింది. వైయస్సార్సీపీ అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ఆమోదంతో ఈ నియామకం జరిగింది. నెల్లూరుజిల్లా మనుబోలుకు చెందిన ఎ.తులసీరామ్‌ను రాష్ట్ర కార్యదర్శిగా, నెల్లూరు నగర, రూరల్ నియోజకవర్గాలకు చెందిన ఎస్‌కెహాజీ, బి.శివగుప్తాలను ఉపకార్యదర్శులుగా నియమించింది. కావలికి చెందిన మహేష్‌రెడ్డిని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమించింది.

# ఎన్నికల హామీలు నెరవేర్చండి

**– డివైఎఫ్ఐ రాష్ట్ర నాయకుడు సూర్యారావు**

ఎన్నికల సమయంలో టిడిపి, బిజెపిలు ప్రజలకు ఇచ్చిన, ముఖ్యంగా యువజనులకు ఇచ్చిన ఎన్నికల హామీలను నిలబెట్టుకోవాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి సూర్యారావు డిమాండ్ చేశారు. ఈ నెల 23న నెల్లూరులోని రామచంద్రారెడ్డి భవన్‌లో జరిగిన డివైఎఫ్ఐ ప్లీనరీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టిడిపి నాయకులు ఇంటికో ఉద్యోగం ఇస్తామని, నిరుద్యోగ భృతి కల్పిస్తామని హామీలు ఇచ్చారని, అయితే అధికారంలోకి వచ్చాక వాటి విషయం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఆ రెండు పార్టీలు ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చాయని, నేటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేకపోగా, కార్మికుల హక్కులను కాలరాసే విధంగా వ్యవహరిస్తున్నాయని ఆయన విమర్శించారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం సాగించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.సుబ్రహ్మణ్యం, రత్తయ్య, సుధీర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా, డివైఎఫ్ఐ జిల్లా శాఖకు నూతన కార్యదర్శిగా పి. కిరణ్‌ను ఎన్నుకున్నారు.




# ఎన్‌సిసి క్యాడెట్ల స్వచ్ఛభారత్ ర్యాలీ

ఆంధ్ర నావెల్ యూనిట్ నెల్లూరు వారి ఆధ్వర్యంలో ఎన్‌సిసి డేని పురస్కరించుకుని ఇటీవల స్వచ్ఛభారత్ ర్యాలీని నిర్వహించారు. నెల్లూరు దర్గామిట్ట శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం వద్ద కమాండింగ్ ఆఫీసర్ బండారు వెంకట సుబ్బారావు ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ దొడ్ల సుబ్బారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహం వరకు సాగింది. అనంతరం ఎన్‌సిసి క్యాడెట్లు, నావెల్ సిబ్బంది కలిసి ప్రభుత్వ ఆసుపత్రిలో స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టారు. ఆసుపత్రి ఆవరణలోని చెత్తాచెదారాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో సబ్‌లెఫ్ట్‌నెంట్ ప్రభాకర్, ఏఎన్‌వోలు గుండాల నరేంద్రబాబు, సివి నాగరాజు, పిఐ స్టాఫ్ సత్యనారాయణ, శివ, నావెల్ స్టాఫ్, విఆర్‌సి, సర్వోదయ, కేఏసి, కెఎన్‌ఆర్, విఆర్ నగరపాలక ఉన్నత పాఠశాలల ఎన్‌సిసి క్యాడెట్లు పాల్గొన్నారు.

# సర్వోదయలో 'స్వచ్ఛభారత్'

ఎన్‌సిసి 66వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరు సర్వోదయ కళాశాలలో ఆదివారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 10ఏ నావల్ యూనిట్ ఎన్‌సిసి మాస్టర్ చీఫ్‌పిటి ఆఫీసర్ సంత్‌లాల్ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ తల్లిదండ్రులు, గురువులు, పెద్దలను గౌరవించాలన్నారు. కార్యక్రమంలో సబ్‌లెఫ్ట్‌నెంట్ ప్రభాకర్, ధనుంజయ, గుండాల నరేంద్రబాబు, రామన్ తదితరులు పాల్గొన్నారు.

# జనార్ధన్‌రెడ్డి కాలనీలో నీరు–చెట్టు

ఫ్రెండ్స్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరు జనార్ధన్‌రెడ్డి కాలనీలోని ప్రభుత్వ హెల్త్ సెంటర్‌లో స్వచ్ఛభారత్ నీరు–చెట్టు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు సెంటర్ పరిసరాలను శుభ్రం చేసి మొక్కలు నాటారు. సభ్యులు వెంకటకుమార్, రాజు, మల్లి, శివకుమార్, మధు, మహ్మద్, శ్రీకాంత్, ఇర్ఫాన్, జమీర్, లెనిన్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.



## ఎల్లలు దాటిన నెల్లూరు వెలుగు..

# డా. ఎ.జగదీష్

### శాస్త్రవేత్తగా 4 దశాబ్దాలుగా కృషి

నెల్లూరు నుంచి శాస్త్రవేత్త అనగానే వెంటనే మనకు గుర్తొచ్చే వ్యక్తి డా. ఎ.జగదీష్. ప్రత్యామ్నాయ ఇంధన వనరులు, వాతావరణం, అప్రాప్రియేట్ టెక్నాలజీలలో దాదాపు నలభై సంవత్సరాలుగా ఆయన చేస్తున్న కృషి ఎంతో అపారమైనది..అమోఘమైనది. ప్రపంచవ్యాప్తంగా ఎంతో ప్రాధాన్యత వున్న ప్రత్యామ్నాయ ఇంధన వనరుల శాస్త్రవేత్తగా ఆయన జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోనూ ప్రఖ్యాతి చెందుతూ, శాస్త్రసాంకేతిక రంగంలో సింహపురిసీమ కీర్తిబావుటాను రెపరెపలాడిస్తున్నారు. చాలామంది శాస్త్రవేత్తలు విదేశాలకు వెళ్ళి ఎంతో పేరుగాంచడం చూస్తూనేవుంటాం. అయితే, డా. ఎ.జగదీష్ అందుకు భిన్నంగా మాతృభూమిపై అభిమానంతో పుట్టిన వూరును వీడకుండా, నెల్లూరులోనే నివాసం వుంటూ, ఇక్కడి నుంచి అనేక దేశాలకు వెళ్తూ ప్రఖ్యాత శాస్త్రవేత్తగా గుర్తింపు పొందుతుండడం సింహపురీయులందరికీ గర్వకారణం.

ప్రపంచ ప్రఖ్యాతిచెందిన శాస్త్రవేత్త ప్రొ.వై.నాయుడమ్మకు డా. ఎ.జగదీష్ శిష్యుడు. నాయుడమ్మ అంటే ఆయనకెంతో గౌరవం. అందుకే, డా.జగదీష్ 1994లో తన గురువుగారైన నాయుడమ్మ పేరిట నెల్లూరులో 'నాయుడమ్మ సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆల్టర్నేటివ్స్'ను స్థాపించారు. ఈ సంస్థ ద్వారా గత 20ఏళ్ళుగా, ప్రతిఏటా ప్రఖ్యాత శాస్త్రవేత్తలకు 'నాయుడమ్మ అవార్డు'ను ప్రదానం చేస్తున్నారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన ఈ అవార్డును అందుకున్న ప్రముఖుల్లో పలు అంతర్జాతీయ శాస్త్రవేత్తలు వుండడం విశేషం. రెండు సంవత్సరాల క్రితం ఈ సంస్థ పేరుతోనే ఆయన drjagadeeshncda.blogspot.com బ్లాగ్‌ను నిర్వహిస్తున్నారు. ఈ బ్లాగ్‌లో ఆయన వివిధ సాంకేతిక వైజ్ఞానిక పత్రికల్లో ప్రచురించిన వ్యాసాలు, కామెంట్‌లు వుంటాయి. ఈ బ్లాగ్ అమెరికాలో కూడా బాగా ప్రాచుర్యం పొందడం ఎంతైనా విశేషం. అమెరికాతో పాటు, ఇండియా, జర్మనీ, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, రష్యా, యుక్రైన్, చైనా, కెనడా, టర్కీ వంటి దేశాల్లోనూ ఈ బ్లాగ్ విశేష ప్రాచుర్యం పొందుతోంది. ఆయన ప్రచురించిన వ్యాసాలు, కామెంట్స్ సుమారు 4 వేల దాకా వున్నాయి. గత మూడేళ్ళలోనే అంతర్జాతీయ ప్రసిద్ధిగాంచిన నేచర్, సైంటిఫిక్ అమెరికన్, ఐఈఈఈ, న్యూస్‌వీక్, న్యూయార్క్ టైమ్స్, వాషింగ్టన్ పోస్ట్, గార్డియన్; సైన్స్, లైఫ్, హార్వర్డ్ బిజినెస్ రివ్యూ, ఎమ్.ఐ.టి టెక్నాలజీ రివ్యూ తదితర 70 ప్రసిద్ధిచెందిన పత్రికల్లో డా.జగదీష్ రచించిన వ్యాపాలు ప్రచురితమయ్యాయి. అంతేకాదు, ఆయన 140కి పైగానే పరిశోధనాపత్రాలను జాతీయ, అంతర్జాతీయ పత్రికల్లో ప్రచురించారు కూడా.

### *40 అంతర్జాతీయ సదస్సుల్లో డా. జగదీష్ పరిశోధనాపత్రాలు :*

అన్నిటికంటే విశేషంగా, డా.జగదీష్ 40 దేశాల్లో జరిగిన అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని తన పరిశోధనాపత్రాలను సమర్పించారు. పలు అంతర్జాతీయ వైజ్ఞానిక కమిటీలలో సభ్యులుగా కూడా నియమితులయ్యారు.నెట్‌వర్క్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ సస్టైనబిలిటీ, అమెరికన్ అసోసియేషన్ ఫర్ ది అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ సైన్స్ (వాషింగ్టన్), ఇంజనీరింగ్ ఫర్ డెవలపింగ్ కంట్రీస్, యూనివర్శిటీ ఆఫ్ కొలరాడ్ (అమెరికా), వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ఇంజనీరింగ్ ఆర్గనైజేషన్ ఎనర్జీ స్టాండింగ్ కమిటీ విండ్ టాస్క్‌ఫోర్స్ (బ్రెజిల్), వర్కింగ్ గ్రూప్స్ ఆఫ్ ది యుఎన్ ఫౌండేషన్ ఫర్ సస్టైనబుల్ ఎనర్జీ ఫర్ ఆల్ (వాషింగ్టన్) తదితర విశిష్టమైన కమిటీల్లో ఆయన సభ్యులుగా వుండడం విశేషం. కేంద్రప్రభుత్వ ప్రత్యామ్నాయ ఇంధన వనరుల కమిటీల్లో కూడా డా. జగదీష్ సభ్యునిగా పనిచేసి, విశేషమైన సేవలందించారు.

### *ఎన్నెన్నో ప్రతిష్టాత్మక అవార్డులు :*

డా.ఎ.జగదీష్ సేవలకు గుర్తింపుగా ఎన్నో అవార్డులు లభించాయి. ప్రతిష్టాత్మకమైన మార్గరెట్ నోబుల్ ఫౌండేషన్ ఎనర్జీ టెక్నాలజీ, సీటెల్, అమెరికాతో పాటు 15 జాతీయ, అంతర్జాతీయ, స్థానిక అవార్డులను ఆయన అందుకున్నారు. వైజ్ఞానిక, సాంకేతిక రంగాల్లో డా.జగదీష్ సాధించిన విజయాలకు గుర్తింపుగా క్లేటన్, విక్టోరియా, ఆస్ట్రేలియాలోని 'ఆస్ట్రేలియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హై ఎనర్జిటిక్ మెటీరియల్స్' సైంటిఫిక్ కమ్యూనికేషన్స్ వైస్ ఛాన్సలర్‌గా నియమితులయ్యారు. ప్రస్తుతం ఎంతో పాపులర్‌గా వున్న సోషల్ నెట్‌వర్క్ ఫేస్‌బుక్, గూగుల్‌లోనూ జగదీష్ వివరాలు, ఆయన రచించిన వైజ్ఞానిక వ్యాసాలు వేల సంఖ్యలో లభ్యమవుతాయి. తానెంతటి ప్రఖ్యాత శాస్త్రవేత్త అయినప్పటికీ, ఎంత ఎదిగినా ఒదిగా వుండే తత్వం.. మనస్తత్వం ఆయనది. నేటికీ ఎంతో నిరాడంబరంగా.. వినమ్రంగా వుంటూ, ప్రజలందరికీ శాస్త్రసాంకేతిక రంగాల ఫలాలు అందాలనే ఏకైక లక్ష్యంతో తన సేవలు అందిస్తుండడం ఆయన విజ్ఞతకు, అపారమైన సేవాభిలాషకు నిదర్శనం. సింహపురి సీమ గర్వించదగిన అంతర్జాతీయ శాస్త్రవేత్త డా. జగదీష్, ఇంకా మరెన్నో విజయాలను సాధించాలని, తన విజ్ఞాన సంపత్తితో ప్రపంచస్థాయిలో మరింత ప్రఖ్యాతి గడించాలని, ప్రజాబాహుళ్యానికంతంటికీ మహోన్నతమైన సేవలందించాలని ఆశిద్దాం!

# తొలగించరా..?

(మొదటిపేజీ తరువాయి)

ఇళ్లల్లో వారికి నిద్ర కూడా కరువైంది. అలాంటి బాధితుల జాబితాలో ఇప్పుడు మాజీఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్యనాయుడు కూడా చేరడం గమనార్హం. అనిల్ గార్డెన్స్‌కు వెనుక లెక్చరర్స్ కాలనీలో కొమ్మి కొత్తగా ఇళ్లు కడుతున్నారు. పెళ్లిళ్ల సీజన్‌లో ఈ ఇంట్లో నిద్ర పట్టదనుకున్న ఆయన అనిల్‌గార్డెన్స్‌పై కార్పొరేషన్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వెలిసిన అనిల్‌గార్డెన్స్‌ను తొలగించాలని గత మూడేళ్ళుగా స్థానికులు కూడా పోరుతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా కట్టిన అనిల్‌గార్డెన్స్‌ను తొలగించడానికి నగర పాలక సంస్థ మీనమేషాలు లెక్కిస్తుంది. అనిల్‌గార్డెన్స్‌పై న్యాయపోరాటం మొదలుపెట్టింది కూడా 'లాయరే'. అనిల్‌గార్డెన్స్‌పై హైకోర్టులో కేసు నడిచింది. నిబంధనలు పాటించకుండా కట్టిన అనిల్‌గార్డెన్స్‌ను తొలగించాలని హైకోర్టు గతంలోనే ఆదేశించింది. అయితే తమకు ముందస్తుగా ఎలాంటి నోటీసు ఇవ్వలేదని, నోటీసు ఇవ్వకుండా ఎలా తొలగిస్తారో వివరణ ఇవ్వాలని అనిల్‌గార్డెన్స్ యాజమాన్యం హైకోర్టులో రిట్‌పిటిషన్ వేసింది. 2012 జూలై 2వ తేదీన తాము ఇచ్చిన నోటీసుకు తమకు సమాధానం ఇవ్వకుండా కోర్టులో తమపై పోరాటం చేస్తున్నారని తమ పిటిషన్‌లో వివరించగా, దీనిని విచారించిన హైకోర్టు అనిల్‌గార్డెన్స్‌ను తొలగించడానికి కారణాలను వివరిస్తూ, వారికి నోటీసు జారీచేసిన తదుపరి చర్యలు చేపట్టాలని ఆదేశిస్తూ హైకోర్టు 2014 ఫిబ్రవరి24న ఆదేశాలు జారీచేసింది. అంతేకాకుండా నోటీసుకి సమాధానం ఇచ్చిన వెంటనే అనిల్‌గార్డెన్స్‌పై చట్టపరమైన అన్ని చర్యలు తీసుకోవాలని, దీనిపై ఇరువర్గాల వారూ మళ్ళీ కోర్టును ఆశ్రయించాల్సిన పనిలేదంటూ తుదితీర్పును ఇస్తూ జస్టిస్ రమేష్ రంగనాధన్ ఆదేశాలు జారీచేశారు. అయితే హైకోర్టు ఆదేశాల మేరకు నగరపాలకసంస్థ ఇంతవరకు అనిల్‌గార్డెన్స్ యాజమాన్యానికి ఎలాంటి నోటీసు జారీచేయలేదు. నగర పాలక సంస్థ వివరణ ఇవ్వలేదనే సాకుతో అనిల్‌గార్డెన్స్ యాజమాన్యం కూడా తమ కార్యకలాపాలు కొనసాగిస్తూనేవుంది.

దాదాపు 8నెలల క్రితం తీర్పు వెలువడితే ఇంతవరకు ఘనత వహించిన మన నగర కార్పొరేషన్ అధికారులు ఈ విషయమై స్పందించడంలేదంటే "అనిల్" బృందం నుండి ఏ స్థాయిలో లంచాలు మింగుతున్నారో అర్థం చేసుకోవచ్చు. ముక్కుసూటిగా వ్యవహరిస్తున్న కమిషనర్ చక్రధర్‌బాబు అయినా దీనిపై దృష్టిపెట్టాలి. ఇంతకాలం ఆర్థిక, రాజకీయ పలుకుబడితో అనిల్‌గార్డెన్స్‌ను నిలిపారు. ఈ అక్రమాలను కొత్త కమిషనర్ అయినా అడ్డుకోవాలి. మొండిగా పోరాడే కొమ్మి లాంటి నాయకులు కూడా దీనిని తొలగించ డానికి పంతంపడితే స్థానికులకు ప్రశాంతతో పాటు మాగుంట లే అవుట్‌కు మినీ బైపాస్‌కు అనుసంధానంగా ఒక మంచి మాస్టర్‌ప్లాన్ రోడ్డు కూడా ఏర్పడుతుంది.

# కలెక్టర్ జానకి

(మొదటిపేజీ తరువాయి)

కమిషనర్‌గా, కృష్ణాజిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా సేవలందించి గ్రేటర్ విశాఖ అదనపు కమిషనర్‌గా వెళ్లారు. అక్కడినుండి నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా వచ్చారు. ఇప్పటివరకు జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన నాగులాపురం శ్రీకాంత్‌ను ప్రభుత్వం రాజధాని భూసేకరణ విభాగానికి ప్రత్యేక కమిషనర్‌గా నియమించింది. 2013జూన్ 21న శ్రీకాంత్ జిల్లా కలెక్టర్‌గా వచ్చారు. ఆయన కాలంలోనే అన్ని రకాల ఎన్నికలు జిల్లాలో ప్రశాంతంగా జరిగాయి. ఆయన ఎప్పుడూ మిస్టర్‌కూల్‌గా ఉండేవారు. పనిలో నిదానమెక్కువ. ఎన్నికల అనంతరం తెలుగుదేశం నాయకులు ఆయన బదిలీకి ఒత్తిడి తెచ్చారు. చివరకు ఆయన బదిలీ జరిగినా అత్యంత ప్రాధాన్యత కలిగిన పనిని చంద్రబాబు ఆయనకు అప్పగించడం విశేషం.

# కమలం వైపు.. రెడ్ల చూపు

(మొదటిపేజీ తరువాయి)

తగిన ప్రాధాన్యత కల్పించారు. చంద్రబాబుకు అప్పుడు పెద్దగా కులపిచ్చి లేదు.

కాని గత ఏడాది రాష్ట్ర విభజనతోనే పరిస్థితులు మారిపోయాయి. తెలంగాణ విడిపోవడంతో రెడ్ల బలం రెండు ముక్కలైంది. రాష్ట్రం ఉమ్మడిగా ఉన్నప్పుడు 'రెడ్ల' ఆధిపత్యం వున్న జిల్లాలు ఎక్కువుగా వుండేవి. రాష్ట్రం చీలిపోవడంతో రెడ్ల ఆధిపత్యం వున్న జిల్లాలు కూడా రెండు రాష్ట్రాల మధ్య చీలాయి. దీంతో ఇటు ఏపిలోనూ, అటు తెలంగాణలోనూ రెడ్ల బలం ఒక్కసారిగా తగ్గింది. మొన్న ఎన్నికల్లో అయితే ఏపిలో రెడ్డి, కమ్మ, కాపు అనే ఫీలింగ్ పక్కాగా కనిపించింది. చరిత్రను చూస్తే ఏపిలో రాజకీయంగా కమ్మకు కాపుకు పడేది కాదు. కాని మొన్న ఎన్నికల్లో మాత్రం చంద్రబాబు తెలివిగా కాపులను క్యాచ్ చేశాడు. రెడ్లలో ఎప్పుడూ లేని కులం ఫీలింగ్ మొన్న ఎన్నికల్లో కనిపించింది. వాళ్లంతా జగన్ వైపు చేరారు. రాష్ట్రంలో మెజార్టీ వర్గమైన కాపులు తెలుగుదేశంకు అండగా నిలవడంతో ఆ పార్టీ అధికారంలోకి వచ్చింది. కడప, నెల్లూరు, కర్నూలు, ప్రకాశం వంటి రెడ్ల ప్రాబల్యం వున్న జిల్లాల్లో తమకు సీట్లు తగ్గాయని భావించిన చంద్రబాబు ఇక రెడ్లతో అవసరం లేదనుకున్నాడు. తన పార్టీకి కూడా వారి అవసరం ఉండదనుకున్నాడు. అందుకే పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ రెడ్డి సామాజికవర్గానికి పెద్ద ప్రాధాన్యత లేకుండాపోయింది. చివరకు ఉద్యోగుల బదిలీలకు సంబంధించి కూడా 'రెడ్డి' సామాజికవర్గం వాళ్లు శాపగ్రస్తులవుతున్నారు.

చంద్రబాబు ప్రభుత్వం రెడ్లను అంటరాని వారిగా చూస్తుంది. రాజకీయాలలో ఎప్పుడూ ఆధిపత్యధోరణి ప్రదర్శించే 'రెడ్లు' ఈ పోకడలను జీర్ణించుకోలేకపోతున్నారు. అయితే తెలుగుదేశంకు రాజకీయ ప్రత్యామ్నాయ వేదికగా వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీని నమ్మలేక పోతున్నారు. ఒకసారి జగన్‌ను నమ్మి ఇలా అవమానాలపాలయ్యాం, ఇంకోసారి నమ్మే పరిస్థితి లేదనేది వారి భావన. తెలుగుదేశంకు సరైన ప్రత్యామ్నాయ వేదిక బీజేపీయేనని భావిస్తున్నారు. ఈ రాష్ట్రంలో వేళ్లూనికుని పోవాలని బీజేపీ అధిష్టానం భావిస్తుంది. బీజేపీ అగ్రనేతలెవరూ చంద్రబాబును నమ్మకమైన నేస్తంగా చూడడం లేదు. చంద్రబాబు ఏట్లో ఉన్నప్పుడు బోటుమల్లయ్య, ఒడ్డుకు చేరాక బోడిమల్లయ్య అనే రకం అని వారికి అనుభవపూర్వకంగా తెలుసు. అంతేకాదు ఇప్పుడు రాష్ట్రంలో పార్టీని విస్తరించుకునే అవకాశం కూడా వచ్చింది. మహారాష్ట్రలో రాజకీయంగా పాతుకుపోవడం కోసం శివసేన వంటి పార్టీతోనే పొత్తు వద్దనుకున్న వాళ్లకు తెలుగుదేశం పెద్ద లెక్కేమీ కాదు. ఏపిలో అటు కాంగ్రెస్ నిర్వీర్యం వల్ల, ఇటు వైకాపా నిర్వాకం వల్ల అటూ ఇటూ కాకుండాపోయిన రెడ్లను తమ వైపుకు తిప్పుకునేలా బీజేపీ పావులు కదుపుతుంది. రెడ్లకు కూడా బీజేపీ వైపు గాలి మళ్లుతుంది. కేంద్రంలో ఆ పార్టీనే అధికారంలో వుంది. నరేంద్ర మోడీ ఇమేజ్ బాగా పనిచేస్తుంది. ప్రజలలో చంద్రబాబు పట్ల వ్యతిరేకత పెరుగుతుంది. రాష్ట్రంలో ఇక కాంగ్రెస్ కోలుకునే పరిస్థితి లేదు. కాబట్టి బీజేపీనే భవిష్యత్ రాజకీయ ప్రత్యామ్నాయ వేదికగా రెడ్లు భావిస్తున్నారు. వచ్చే ఎన్నికల నాటికి కాపు, వైశ్య, బ్రాహ్మణ వంటి అగ్ర వర్ణాలతో పాటు ఇతర వర్గాలు కూడా బీజేపీ వైపుకు చేరే అవకాశాలున్నాయి. ఎటుచూసినా భవిష్యత్ బీజేపీదే కాబట్టి ఇక రెడ్లకు బీజేపీనే షెల్టర్ కానుంది.

# ఫలితం నాస్తి

(మొదటిపేజీ తరువాయి)

సింగపూర్‌లాంటి రాజధానిని కట్టాలనుకుంటున్నానని, అందుకు మీ సహకారం కావాలని వారిని అడిగారు. తాను కోరగానే సింగపూర్ ప్రభుత్వం ఒప్పుకుంటుందని, వాళ్లే డబ్బుపెట్టి రాజధానిని కట్టి మనకు అప్పగిస్తారని చంద్రబాబు భావించారు. చంద్రబాబు కంటే వాళ్లు ఆరాకులు ఎక్కువే చదివారు. మీ రాజధానిలో మేం పెట్టుబడులు పెట్టంగాని, మీకు కావాలంటే రాజధానికి మస్టార్‌ప్లాన్‌ను గీసి ఇస్తామని చెప్పారు. దీనికి ఛార్జీగా అక్షరాలా వాళ్లు అడిగింది 1200కోట్లు. ఎన్డీఏ ప్రభుత్వంలో ఉత్తరాఖండ్, జార్ఖండ్, ఛత్తీష్‌గఢ్ రాష్ట్రాలు ఏర్పడ్డాయి. ఇప్పటివరకు ఆ మూడు రాష్ట్రాల రాజధానుల నిర్మాణానికి కలిపి కూడా కేంద్రప్రభుత్వం ఇన్ని నిధులు విడుదల చేయలేదు. మరి ఒక్క మాస్టర్‌ప్లాన్‌కే 1200కోట్లా! సింగపూర్ వాళ్లు గోడకు వేసిన సున్నాన్ని కూడా గీక్కునే రకం. కృత్రిమ పర్యాటక కేంద్రాలను సృష్టించి అన్ని దేశాల పర్యాటకుల నుండి సంపాదన రాబడుతున్న దేశం అది. ట్రేడింగ్ ప్రధాన ఆదాయ వనరు. అలాంటి దేశం నుండి చంద్రబాబు సహకారం ఆశించడం ఇసుక నుండి నూనెను పిండడమే!

# ఆర్టిస్ట్ రాజి

## కాలధర్మం

నెల్లూరు నగరంలో ఆర్టిస్ట్ రాజి అంటే తెలియనివారుండరు. ఫ్లెక్స్ సంస్కృతి, కంప్యూటర్ డిజైన్‌లు అందుబాటులోకి రాకముందు నెల్లూరులో ఎవరు ఎలాంటి డిజైన్ కావాలనుకున్నా ఆర్టిస్ట్ రాజీ వద్దకు వెళ్లాల్సిందే! కొన్ని వేల పెళ్ళిళ్లకు పెళ్లిపత్రికలను డిజైన్ చేసింది రాజినే! అలాగే కొన్ని వందల సంస్థలకు లోగోలను, బ్రోచర్‌లను ఆయన తయారుచేసేవాడు. ఆయన చేస్తే సంస్థకు బాగా కలిసివస్తుందనే సెంటిమెంట్ కూడా ఉండేది. ఆర్టిస్టుగా సుదీర్ఘకాలం నెల్లూరువాసులకు తన సేవలు అందించిన రాజి ఆర్ట్స్ అధినేత గిరిజాల రాజేంద్ర ఈనెల 14వతేదీ కన్నుమూశారు. ఆయనకు ఇద్దరు కుమారులు. గత కొన్నేళ్లుగా రాజి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ మృత్యువుతో పోరాడుతున్నారు. ఆయనకు పోరాటం నుండి విముక్తి కల్పిస్తూ భగవంతుడు తన చెంతకు తీసుకెళ్లాడు. రాజి మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# అభివృద్ధికి బాంబు సెంటిమెంటు

శ్రీను గల్పిక

అది నిజాంనవాబు ఆత్మ కేసీఆర్‌లో దూరి తెలంగాణ ఉద్యమం పేరుతో కబ్జా చేసిన హైదరాబాద్ మహానగరం. శంషాబాద్ ఎయిర్‌పోర్టు. బయటంతా హైటెక్‌రత్న, ఆంధ్రాసీఎం చంద్రబాబు ముఖచిత్రాలతో 'జపాన్ పర్యటనకు బయలుదేరుతున్న చంద్రబాబుకు శుభాకాంక్షలు' అని వ్రాసి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. ఎయిర్‌పోర్టు రన్‌వేమీద ఒక విమానం సిద్ధంగా వుంది. దాని చుట్టూ కొబ్బరిమట్టలు, అరటి చెట్లు, మామిడి ఆకులతో అలంకరించి వున్నారు. విమానానికి ఇరువైపులా చంద్రబాబు, జపాన్ ప్రధాని అకిహిటోల ఫోటోలు ఉన్నాయి. అప్పుడే చంద్రబాబు, ఆయన వెంట కేంద్రమంత్రులు సుజనాచౌదరి, అశోక్ గజపతిరాజు, రాష్ట్రమంత్రులు పి.నారాయణ, గంటా శ్రీనివాసరావు, దేవినేని ఉమామహేశ్వరరావు, బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, శ్రీసిటి ఛైర్మెన్ రవిసన్నారెడ్డి ఇంకా పలువురు పారిశ్రామికవేత్తలు, రాజధాని కమిటి సభ్యులు ఉన్నారు. శుభఘడియలు చూసి అందరూ విమానమెక్కారు. విమానం ఇక బయలుదేరే సమయం కాగా, చంద్రబాబు వద్దకు పైలట్ వచ్చి... సార్, ఫ్లైట్‌లో ఆయిల్ కొంచెమే వుంది. ఆయిల్‌ఫుల్ ట్యాంక్ చేయించడానికి డబ్బులివ్వండని అడిగాడు. అది విని మంత్రి రావెళ్ల కిషోర్‌బాబు... బయలుదేరబోయే ముందా చెప్పేది, ముందుగానే పట్టించుకోవాలని తెలియదా, అయినా తొందరేముంది, కొంచెమైతే ఆయిల్ వుంది కదా, మధ్యలో ఎక్కడన్నా టీకి ఆపినప్పుడు పట్టించుకుందాంలే అని అన్నాడు. ఆ మాటకు చంద్రబాబుకు మండి... కిషోర్, ఇదేమన్నా విజయవాడ-నెల్లూరు మధ్య తిరిగే ఎర్రబస్సనుకున్నావా, మధ్యలో ఆపి టీ తాగడానికి, ఎయిర్‌బస్. ఒకసారి ఎగిరాక ఆపడం వుండదు. దిగడమే! మధ్యలో ఆయిల్ అయిపోతే సముద్రంలో పడిపోవడమే అని, పైలట్‌తో అతని మాటలకేంగాని నువ్వు ఫుల్‌ట్యాంక్ చేయించని డబ్బులిచ్చాడు. ఆయిల్ నింపాక పైలట్లు ఎక్కారు. మంత్రి పీతల సుజాత విమానం ముందు నిలబడి మంగళహారతినిచ్చింది. తర్వాత టెంకాయ కూడా కొట్టారు. విమానం రన్‌వే మీదకు రావడానికి ఒక చిన్న ట్రాలీ వెనుకకు నెడుతుంది. కిటికీలో నుండి అది చూసిన రావెళ్ల కిషోర్... చూసారా సార్, విమానం ఇంజన్ ట్రబుల్ ఇచ్చినట్లుంది. ట్రాక్టర్‌తో నెడుతున్నా స్టార్ట్ కావడం లేదు, మా ఊర్లో బస్సులు ఇలాగే ఆగిపోతే అందరం దిగి నెడితే దెబ్బకు స్టార్ట్ అయ్యేది. ఇప్పుడు మనం కూడా క్రిందకు దిగి విమానాన్ని నెడదాం సార్ అని చెప్పాడు. చంద్రబాబుకు అతనికి ఏం చెప్పాలో అర్థంకాక, కిషోర్ జపాన్‌లో మనం అడుగుపెట్టేదాకా నువ్వేమీ మాట్లాడొద్దంటూ నోటికి ప్లాస్టర్ అంటించాడు. తర్వాత ఫ్లైట్ గాల్లోకి లేచింది. చంద్రబాబుకు ఇంకోపక్క సీట్లో నారాయణ కూర్చున్నాడు. చంద్రబాబుతో ఆయన... సార్, మనం సింగపూర్‌కు వెళ్లొచ్చాం కదా, సింగపూర్ లాంటి రాజధాని కడతామని వాళ్లకి చెప్పాం, మరిప్పుడు రాజధాని పేరుతో జపాన్‌కు పోతున్నాం. వాళ్లకు ఏమని చెబుదామని అడిగాడు. మనం ఏ దేశానికి పోతే ఆ దేశం లాంటి రాజధాని కడతామనే చెప్పాలి. ఉగాండా, సోమాలియా వంటి దేశాలకు వెళ్లినా వాళ్ల రాజధానుల్లాంటివే మనమూ కట్టనున్నామని చెప్పాలి అని చంద్రబాబు చెప్పాడు. మనం ఇంతకూ ఎలాంటి రాజధాని కట్టబోతున్నామని నారాయణ అడిగాడు. చంద్రబాబు... నాకుమాత్రం ఏం తెలుసు... ఎలాంటి రాజధాని కట్టాలనే విషయం మీద మనం ఒక నిర్ణయానికి రావాలంటే దాదాపు 150దేశాల రాజధానులను పరిశీలించాల్సి వుంది. మనం ఇప్పుడు రెండో దేశానికే పోతున్నాం. కాబట్టి 150దేశాలు తిరగాలంటే మనకు ఈ ఐదేళ్లు సరిపోతాయి. అప్పుడు ఎలాంటి రాజధాని కట్టాలనేదానిపై మనకు ఒక అవగాహన వస్తుంది. ఆ తర్వాత వచ్చే ఎన్నికల్లో మనం అద్భుతమైన రాజధానిని చూడాలంటే చంద్రబాబునే మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలనే నినాదంతో ప్రజలముందుకు వెళదాం... ఎలా వుంది నా ఐడియా అని చెప్పాడు. మీ ఐడియా మీ జీవితాలను, మా జీవితాలనే కాదు, రాష్ట్ర ప్రజల జీవితాలను కూడా మార్చేస్తుందని నారాయణ అన్నాడు. ఎయిర్‌హోస్టెస్ లైట్లు ఆపేయడంతో అందరూ నిద్రకు ఉపక్రమించారు. జపాన్‌కు చేరువవుతున్న సమయంలో అందరికీ మెలకువ వచ్చింది. రావెళ్ల కిషోర్‌బాబు నోటికివున్న ప్లాస్టర్ తీసేసి... సింగిల్ టీ అంటూ ఎయిర్ హోస్టెస్‌కు చెప్పాడు. ఆ మాటకు నిద్రలోవున్న పత్తిపాటి పుల్లారావు ఉలిక్కిపడి లేచి... నాకు రెండు సమోసా అంటూ ఆర్డర్ చేశాడు. చంద్రబాబు వెంటనే... ఫ్లైట్ మీ ఆర్టీసీ బస్టాండ్‌లో ఆగలేదు. మీరు టీలు, సమోసాలు తినడానికి, ఇంకో పదినిముషాలలో మనం జపాన్‌లో దిగబోతున్నాం అని చెప్పాడు. ఈలోపు ఎమ్మెల్యే యలమంచిలి శివాజీ కాక్‌పిట్ వద్దకుపోయి పైలట్‌తో... బాబూ ఎక్కడన్నా పొలాలు చూసి ఆపకూడదు, రాత్రి నుండి అందరూ ఉగ్గబట్టి ఉన్నాను, అలా పాస్‌పోసుకుని వస్తామన్నాడు. అది విని సుజనాచౌదరి అతన్ని తీసుకొచ్చి సీట్లో కూర్చోబెట్టి ఇంకో పదినిముషాలు ఓపికపట్టు అని గదమాయించాడు.

కొద్దిసేపటికి విమానం టోక్యో ఎయిర్‌పోర్టులో దిగింది. జపాన్ అధ్యక్షుడు షిజోఅంజే, ప్రధాని అకిహిటోలు చంద్రబాబు బృందానికి నడుం వంచి తమ భాషలో స్వాగతం పలికారు. చంద్రబాబు కూడా మర్యాదగా వుంటుందని వాళ్ల శైలిలోనే నడుంవంచి నమస్కారం పెడుతుండగా... రావెళ్ల కిషోర్... మరీ ఎక్కువ వంగమాకన్నో... నడుం పట్టేస్తుంది. వాళ్లకంటే రోజూ అలవాటు కాబట్టి రబ్బరులాగా వంగేస్తుంటారని అన్నాడు. చంద్రబాబు అతనివైపు కోపంగా చూస్తూ... నీ నోటికి నేనేసిన ప్లాస్టర్ ఏమైందని అడిగాడు. అది ఫ్లైట్ దిగేదాకేకదన్నా, ఫ్లైట్ దిగాక తీసేయొచ్చుకదా అని తీసేసానన్నాడు. తర్వాత అందరూ ఒక ఏసి బస్సెక్కారు. టోక్యో నగరాన్ని చూడసాగారు. ఎటుచూసినా ఫ్లైవర్లు, పదిలైన్ల రోడ్లు, మెట్రోరైల్వేలైన్లు... అందరూ కళ్లు బత్తాయిలంత వెడల్పు చేసి చూస్తున్నారు. చిత్తూరు ఎంపీ శివప్రసాద్ వుండి... సార్, ఈ ఫ్లైవర్లు, రోడ్లు, బిల్డింగ్‌లు వేసిన నాటినుండి ఎంతకాలముంటాయని అడిగాడు. దానికి షింజో అబే... ఇవన్నీ మా చిన్నతనంలో వేసినవి... ఇప్పటికీ అలానే వున్నాయని చెప్పాడు. అది విన్న వెంటనే శివప్రసాద్, చంద్రబాబుతో.. అన్నో మనకు ఇలాంటి రాజధాని వద్దేవద్దు అని అన్నాడు. అదేంటి అలా అంటావని చంద్రబాబు అడిగాడు. లేకపోతే ఏంటన్నా... వీళ్ల చిన్నప్పటి నుండి ఈ రోడ్లు, ఫ్లైవర్లు ఇలానే ఉన్నాయంటే... అవి ఇలాగే వుంటే కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధులు ఎలా బతకాలి... ఏడాదికొకసారన్నా వేసిన రోడ్డును మళ్లీ వేస్తుండాలి, పదేళ్లకొకసారన్నా కట్టిన ఫ్లైవర్‌ను మళ్లీ కట్టాలి, అప్పుడే కదా చేతినిండా పని, జేబు నిండా డబ్బు అని శివప్రసాద్ అన్నాడు. అతని మాటలకు చంద్రబాబుకు ఏం చెప్పాలో అర్థంకాక తల పట్టుకున్నాడు.

తర్వాత అదే బస్సులో అమెరికా అణుబాంబు దాడికి గురైన నాగసాకీ పట్టణానికి వెళ్లారు. దాని తర్వాత హిరోషిమా వెళ్లారు. ఆ రెండు పట్టణాల గురించి అకిహిటో వారికి వివరిస్తూ... అమెరికా అణుబాంబులు వేయకముందు ఈ రెండు సాధారణ పట్టణాలుగా ఉండేవి. అణుబాంబు దాడికి గురయ్యాక మాలో కసి పెరిగింది. పట్టుదలతో పని చేసాం, ప్రపంచంలోనే అత్యంత అందమైన నగరాలుగా తీర్చిదిద్దామని చెప్పాడు. అది విన్న రావెళ్ల కిషోర్‌బాబు... చంద్రబాబుతో... అన్నా ఇది వింటుంటే నాకో ఐడియా వచ్చిందన్నాడు. ఏంటో చెప్పితగలడు అని చంద్రబాబు అన్నాడు. అణుబాంబులు వేసాకే ఈ రెండుపట్టణాలను ఇంత అద్భుతంగా నిర్మించారు. అంటే వీటికి బాంబు సెంటిమెంట్ కలిసొచ్చింది. అలాగే మనం కూడా ఆఫ్ఘనిస్థాన్ వాడినో, పాకిస్థాన్ వాడినో బ్రతిమలాడుకుని మనం రాజధానికి ఎంపిక చేసిన ప్రాంతం మీద రెండు బాంబులు వేయించుకుందాం, ఆ తర్వాత మనలోనూ కసిపెరిగి అందమైన నగరాన్ని నిర్మించుకోవచ్చని చెప్పాడు. ఆ మాటలు విన్న చంద్రబాబు... అతన్ని ఏమీ అనలేక తన జుట్టు తానే పీక్కోవడం మొదలుపెట్టాడు.

## కదంబం

### ఒక నిర్భయతండ్రి

- ఆశారాజు,
హైదరాబాద్. 9392302245

ఒక నిర్భయ తండ్రి
అమ్మ నీవెంటరాదు
నాన్న నీ పక్కనుండడు
మనుషులు తిరిగే అడవిలో
ఎట్లా బతుకుతావమ్మా!

మృగాలు వెనక్కి తిరిగిపోతాయి
సర్పాలు పక్కకు తప్పుకొంటాయి
ఆడది ఎదురుపడితే -
మగాడు మీదపడుతాడమ్మా!

మేధావులు శిక్షలు అనాగరికమంటారు
మహిళా సంఘాలు అవగాహన
పాఠాలు నేర్పాలంటారు
మీడియాలో షోకులొలుకబోసే
బాధితులు కానివారి
నీతులు ముగిసేలోపల -
నిన్నే కాదు, -
మీ అమ్మనూ చెల్లెనూ
చెరిచి చంపేస్తారమ్మా!

న్యాయం నోరువిప్పదు
చట్టం కళ్లు తెరువదు
కీచకులందరూ నాయకులైతే -
నీకు అండగా ఎవరుంటారమ్మా!
ఈ పగటిపూట చీకట్లో
ఇల్లెట్లా చేరుతావమ్మా!

## భగవద్గీత కంఠస్థ పోటీలు

గీతాజయంతిని పురస్కరించుకుని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 23న భగవద్గీత కంఠస్థపోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. నెల్లూరు గుండా ఆంజనేయులు కళ్యాణమండపంలో నగర స్థాయిలో ఈ పోటీలు జరిగాయి. పోటీల్లో విజేతలైన పి.ధామిత, ఎన్.లక్ష్మీ చేతన, డి.దీప్తి, వి.సాయి ఉమామహేశ్వరి, పి. వంశీకొస్తుభ్, ఎస్ పూర్ణమ్మ, బి.లిఖిత్‌కుమార్, పి. సాయిలక్ష్మి, బి.చందనప్రియ, షేక్ షఫీ, ఎన్.మౌనిక, డివి పద్మలత, వి.పెంచలప్రసన్నలకు బహుమతులను అందజేశారు. విహెచ్‌పి జిల్లా శాఖ అధ్యక్షుడు గుండా ఆంజనేయులు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించగా, విహెచ్‌పి రాష్ట్ర కార్యదర్శి మెంటా రామ్మోహన్, జిల్లా కార్యదర్శి వి.మధుసూదన్‌లతో పాటు కె. వెంకటేశ్వర్లు, ఎ. హరినారాయణ, ఏ.రాజేంద్ర స్వామీజీ, బయ్యా శ్రీనివాసులుగుప్తా, పోటీల కన్వీనర్ చింతాల సుకుమార్, ధర్మప్రచారసమితి అధ్యక్షుడు సివి సుబ్రహ్మణ్యం, ప్రాజెక్టు కన్వీనర్ హరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన లాలిపాటల పోటీలు

సృజన సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరు టౌన్‌హాలు రీడింగ్‌రూమ్‌లో లాలిపాటల పోటీలు జరిగాయి. ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి ఔత్సాహిక గాయకులు పాల్గొని తమ ప్రతిభను చాటారు. సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు దగ్గుపాటి రాధాకృష్ణ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా భవానీ నాగేంద్రప్రసాద్, మారం సుధాకర్, అక్బర్‌బాషా, కొండూరు అపర్ణ, రాజేశ్వరి, శింగంశెట్టి మురళీమోహన్‌రావు, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు ముఖ్యఅతిథులు బహుమతులు అందజేశారు.

## 30న గీతా జయంతి వేడుకలు

టిటిడి, హిందూ ధర్మ ప్రచార పరిషత్‌ల ఆధ్వర్యంలో ఈనెల 30వతేదీన గీతా జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు ధార్మిక సలహామండలి అధ్యక్షుడు సి.వి. సుబ్రహ్మణ్యం, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ హరనాధ్ తెలియ జేశారు. ఈ సందర్భంగా నెల్లూరులోని నిప్పోసెంటర్ సాయిబాబా మందిరంలో ఆధ్యాత్మిక ప్రవచనా లుంటాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు, విద్యార్థులు అందరూ పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

## విదేశీవిద్యపై అవగాహన సదస్సు

నెల్లూరుజిల్లా కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కాలేజీలో సోమవారం విదేశీవిద్యపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నెదర్‌ల్యాండ్స్‌లో టెక్నికల్ యూనివర్శిటీ ఆఫ్ ఐండోవన్‌లో సెక్యూరిటీ గ్రూప్ విభాగానికి చెందిన డాక్టర్ శ్యామ్యూల్ కలువూరి విదేశీవిద్యకు సంబంధించి పలు అంశాలు, అభిప్రాయాలు విద్యార్థులకు విశదీకరించారు. ప్రతి విద్యార్థికి కమ్యూనికేషన్‌స్కిల్స్, ఆంగ్లభాషలో మెలుకువలు అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్బారావు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## అన్నదానం



నెల్లూరు బాలాజీనగర్‌లోని గీతామయి వృద్ధుల ఆశ్రమంలో సోమవారం నెల్లూరుకు చెందిన శ్రీరాం టింబర్ అధినేత కె.నాగేశ్వరరావు మనుమరాలు జ్యోతిర్మయి పుట్టినరోజు సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులకు అల్పాహారం, మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షులు తిరివీధి కిషోర్, కోశాధికారి నీలిశెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాజుపాళెంలో స్టూడెంట్స్ వార్

# ఇంజనీరింగ్ కాలేజీలో "శివ గ్యాంగ్"

పాతికేళ్ల క్రితం యువతను ఉర్రూతలూగించిన రామ్‌గోపాల్ వర్మ "శివ" సినిమా విడుదలై పాతికేళ్లైన సందర్భంగా ఇటీవల ఆ సినిమా విశేషాలన్నీ ప్రముఖంగా అన్ని టివి ఛానెళ్ళలో ప్రసారమయ్యాయి. ఆ ప్రభావం మళ్ళీ ఇన్నాళ్లకు నేటి యువతపై పడినట్లుంది. యవ్వనదశలో ఇంజనీరింగ్ కళాశాలలో చేరే యువత ఉడుకురక్తంతో వెర్రివేషాలేసే సంస్కృతి కొన్ని దశాబ్దాలుగా వున్నా ఇటీవల కాలంలో అలాంటి సంఘటనల సంఖ్య బాగానే తగ్గిందని చెప్పవచ్చు. అయితే తాజాగా నెల్లూరుజిల్లాలో జరిగిన ఓ సంఘటన పాతరోజులను గుర్తుకుతెస్తోంది. ఫేస్‌బుక్‌లు, ఇంటర్‌నెట్ ఛాటింగ్‌లు, వాట్సప్ మేసేజిలు, సెల్‌ఫోన్ సంభాషణలు నేటి యువతపై చూపుతున్న ప్రభావాలలో ఇదో భాగం అని చెప్పొచ్చు.

నెల్లూరురూరల్ రాజుపాళెంలో వున్న ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో చైన్‌బ్యాచ్, బ్యాట్‌బ్యాచ్‌లు తయారై కాలేజీ యాజమాన్యానికి తలనొప్పిగా మారాయని సమాచారం. తిరుమల వెంకటేశ్వరుని పేరుతో మొదలైన ఈ కళాశాల యాజమాన్యం మొదటి మూడు సంవత్సరాలు విద్యార్థుల ఎంపికలోనూ సిబ్బంది నియామకాలలోనూ చిత్తశుద్ధి పాటించి నాణ్యతకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చింది. అయితే కాలేజీ చాలా బాగుందన్న పేరు ప్రజల్లోకి విస్తరించిన అనంతరం వీరి పోకడ మారింది. పేరొచ్చేసింది కదా ఇంక మనకేం అనుకున్నారో ఏమో... అడ్మిషన్ల విషయంలో గేట్లు బార్లా తెరిచేసి నాణ్యతకంటే ఆదాయానికే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేశారు. వేరే కాలేజీల్లో డిబార్ కాబడిన ప్రబుద్ధులను కూడా ఇక్కడ చేర్చేసుకున్నారు. ఇక్కడి నుండే అసలు చిక్కులు మొదలయ్యాయి.

ఇటీవల ఈ కాలేజీలో జరిగిన గొడవల్లో మొదటి సంవత్సరం చదివే ఓ విద్యార్థికి చెయ్యి కూడా విరిగిందని సమాచారం. విద్యార్థులు రెండు గ్రూపులుగా విడిపోయి కయ్యానికి కాలు దువ్వుతుండడంతో ఓ 8మందిని కాలేజీ నుండి నవంబర్‌లో సస్పెండ్ చేశారని తెలిసింది. విషయం బయటకు పొక్కితే ఎక్కడ చెడ్డపేరు వస్తుందోనన్న భయంతో సమాచారాన్ని పోలీసుల దాకా వెళ్లనీయకుండా కాలేజీలోని నాలుగు గోడల మధ్యే సద్దుమణిగేలా చేసేశారని వార్త. అయితే సస్పెండ్ చేసిన 8మంది విద్యార్థుల తల్లిదండ్రులను పిలిపించి వారికి సస్పెన్షన్ లేఖలు అందించారని వినికిడి. ఈ కుర్రోళ్ళలో రాజకీయ పలుకుబడి ఉన్నోళ్ళ సుపుత్రుడు కూడా వున్నాడట.

విద్యా ప్రమాణాలకు తిలోదకాలిచ్చి లాభాలకు పెద్దపీట వేస్తే ఇలాంటి సంఘటనలే జరుగుతాయి. గడచిన విద్యాసంవత్సరాలలో ఎంతో మంచి పేరుందన్న కారణంగా ఈ కాలేజీలో తమ పిల్లలను చేర్పించిన వారంతా ఇప్పుడు ఆందోళన చెందుతున్నారు. కాలేజీ యాజమాన్యం ఇప్పటికైనా మేల్కొని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా విద్యార్థినీవిద్యార్థుల ఎంపిక చేసుకుంటే బాగుంటుందని బిడ్డల అమ్మానాన్నల కోరిక.

# ఎల్ అండ్ టి కంపెనీ అంటే అంత భయమా

*- నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి*



ఎల్ అండ్ టి అనే కాంట్రాక్ట్ కంపెనీ అంటే అధికారులకు అంత భయమెందుకో చెప్పాలని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి విమర్శించారు. మూడు నెలల క్రితం నెల్లూరు వచ్చిన రాష్ట్ర మున్సిపల్ శాఖామంత్రి నారాయణ నెల్లూరు రూరల్ ప్రాంతంలో వున్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను పరిశీలించి ఈ నిర్మాణంపై తగిన విచారణ చేపట్టి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని, కాని ఇప్పటివరకు ప్రజలకు ఉపయోగపడే విషయంపై మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. సమ్మర్ స్టోరేజిట్యాంకులో నీటి నిల్వ విషయంపై డిప్యూటీమేయర్ ముక్కాల ద్వారకానాథ్‌తో కలిసి కార్పొరేషన్‌లో కమిషనర్ చక్రధర్‌బాబుతో సోమవారం ఎమ్మెల్యే కోటంరెడ్డి చర్చించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ నెల్లూరు నగర ప్రజల దాహార్తిని తీర్చేందుకు దివంగత ముఖ్యమంత్రి వై.యస్.రాజశేఖరరెడ్డి నెల్లూరుకు సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణానికి సుమారు రూ.130కోట్లు కేటాయించారన్నారు. కొందరు ఈ కాంట్రాక్ట్ పనులను ఎల్‌అండ్‌టి సంస్థకు కట్టబెట్టారన్నారు. ప్రస్తుతం ఈ ట్యాంకు పరిస్థితిని చూస్తుంటే ఎందుకూ పనికిరాకుండా కోట్ల రూపాయలు నీళ్ళ పాలు చేసినట్లు ఉందన్నారు. ఈ ట్యాంక్‌లోని నీళ్లు వాడే వాళ్లు రోగాలబారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 80శాతం మంది ఈ ట్యాంక్ నీళ్లను వాడుతున్నారని ఈ విషయంపై గతంలో అసెంబ్లీలో కూడా మాట్లాడానన్నారు. రాష్ట్ర మంత్రి నారాయణ నెల్లూరు వచ్చి చూసి కూడా విచారణ చేయిస్తామని, ఇప్పుడు నిమ్మకుండిపోవటం ఏమిటని ప్రశ్నించారు. రెండురోజుల్లో ఈ సమస్యకు పరిష్కారం తెలుపుతామని కమిషనర్ హామీ ఇచ్చారన్నారు. లేకుంటే ఆమరణ నిరాహారదీక్షకు సిద్ధంగా వున్నట్లు హెచ్చరించారు.

ఈ సమావేశంలో వైయస్సార్‌సీపీ ఫ్లోర్ లీడర్ రూప్‌కుమార్‌యాదవ్, నగర అధ్యక్షుడు తాటి వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాసులు పాల్గొన్నారు.

## రిజిస్ట్రేషన్ బాదుడు..

మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు స్థలాల విలువలు పెరిగి ఇప్పటికే రిజిస్ట్రేషన్ చార్జీలు మోత భారీగా భరిస్తున్న ప్రజలపై మరలా ఛార్జీల భారాన్ని మోపుతూ ఆంధ్రప్రదేశ్ స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ నిర్ణయంతో విక్రయ పత్రాలపై ప్రస్తుతమున్న స్టాంపు డ్యూటి ఫీజును 6శాతం నుండి 7.5శాతానికి పెంచింది. గతంలో స్థిరాస్తుల విక్రయ దస్తావేజులకు విధిస్తున్న స్టాంపుడ్యూటిని 4 నుంచి 5శాతానికి, ఫీజును 0.05శాతం నుండి ఒక్క శాతానికి పెంచింది. అదేవిధంగా కుటుంబసభ్యుల శెటిల్‌మెంట్ పత్రాలకు ఒక్క శాతం నుండి రెండు శాతానికి, ఇతరుల శెటిల్‌మెంట్లుకు రెండు శాతం నుంచి మూడు శాతానికి, స్థానిక సంస్థల బహుమతి డీడ్లకు రెండు శాతం, ఇతరులకు ఐదు శాతం, కుటుంబసభ్యుల పంపకపత్రాలకు ఒక్క శాతం, ఇతరులకు రెండు శాతం పెంచింది. దీంతో నెల్లూరు జిల్లా రిజిస్ట్రేషన్ శాఖకు దాదాపు రూ.25 కోట్లు మేర ఆదాయం పెరిగే అవకాశం వుంది.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

శ్రద్ధాంజలి






ప్రజాసేవలో ధన్యం మీ జీవితం... ప్రజలు మరువరు మీ సేవలు...
కీ॥శే॥ శ్రీ మాగుంట సుబ్బరామరెడ్డి గారు
ఒంగోలు పార్లమెంటు మాజీసభ్యులు
19వ వర్ధంతి సందర్భంగా వారి పవిత్రాత్మకు
శాంతి కలగాలని ప్రార్థిస్తూ...
కుటుంబసభ్యులు మరియు బంధుమిత్రులు
తేది: 1-12-2014, సోమవారం ఉదయం 11 గం॥లకు
నెల్లూరు, రంగనాయకులపేటలోని శ్రీ రాఘవ కళ్యాణమండపమునందు
అన్నదాన కార్యక్రమము జరుగును.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com